నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 25-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:174 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

తక్షణము లక్ష మందికి
కుక్షులు నింపంగ బాబు కోరి సృజించెన్
లక్షన్నర కోట్లు నిలిపి
రిక్షమ్ముగ నుక్కు ఫ్యాక్టరీ నాంధ్రములోన్ !!

(లక్ష మందికి ఉపాధి కల్పించే విధంగా లక్షన్నర కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఉక్కు ఫ్యాక్టరీని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు)

-రాధశ్రీ
సెల్:9494481210

మరక

సంక్షేమం ఒక్కటే
సాధించదు పురోగతి
అభివృద్ధిని విస్మరిస్తే
ఆపరించు తిరోగతి
పాలకులు వస్తుంటరు
పరిపాలన చేస్తుంటరు
ప్రగతి ఏది చేయకుంటే
పల్టీపడీ పోతుంటరు

-వేల్పుల నారాయణ
9440433475

ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్: మంత్రి పొన్నం

హైదరాబాద్, మార్చి 24: హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) తీసుకువస్తున్నట్లు తెలిపారు. రూ.1000 కోట్ల ఆదాయం నష్టమైనా ఈవీ వాహనాలు తీసుకొస్తున్నామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ప్రకటించారు.

తెలంగాణ కాలుష్య రహిత రాష్ట్రంగా ఉండాలని ప్రయత్నిస్తున్నామని.. అందుకోసం ఈ ప్రయత్నం తీసుకువచ్చామని మంత్రి పొన్నం తెలిపారు. ఈవీ ఆటోలతోపాటు బస్సులను సైతం తీసుకుని వస్తున్నామన్నారు. నగరాన్ని క్యూర్ చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఈవీ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోని వివిధ ప్రధాన నగరాలు.. తీవ్ర కాలుష్య ంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఈ విధంగా తయారవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యాయనాల ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది.

గత పదేళ్లుగా వికలాంగులు, వితంతువుల పెన్షన్లు పెంచలేదు కానీ.. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు

-బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్

హైదరాబాద్, మార్చి 24: గత పదేళ్లుగా వికలాంగులు, వితంతువుల పెన్షన్లు పెంచలేదు కానీ.. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ బీజేపీ నేతలపై తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ శాసన సభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో మహేశ్వర్ రెడ్డికి సీతక్క కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కేంద్రం ఏ రకంగా మద్దతు ఇవ్వకున్నా ప్రజాసంక్షేమం కోసం తమ ప్రభుత్వం అధికంగా నిధులు వెచ్చిస్తుందన్నారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా.. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తెచ్చే బాధ్యత మీకు లేదా? అంటూ వారిని నూటిగా ప్రశ్నించారు.

వ్యవసాయంపై కేంద్రం నల్ల చట్టాలు తీసుకు వస్తే.. దీనిపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేశారన్నారు. దాంతో కేంద్రం వెనక్కి తగ్గిందని సీతక్క గుర్తు చేశారు. దేశంలో బడా పారిశ్రామికవేత్తలకు చెందిన రూ.16 లక్షల కోట్లను రుణమాఫీ చేశారు కానీ రైతు రుణమాఫీ మాత్రం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డు ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. వడ్డీ లేని రుణాల మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ బీజేపీ నేతల వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు.

బ్యాంకింగ్ రుణాల కింద రూ.58 వేల కోట్ల మంజూరు చేశామని సీతక్క గుర్తు చేశారు. అలాగే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్, సన్న వడ్లతోపాటు రూ. నాలుగున్నర లక్షల కోట్లతో ఇందిరమ్మ ఇండ్లు కడుతున్నామని తెలిపారు. మీ ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలకు పని లేదన్నారు. రైతులకు ప్రతి నెల పెన్షన్స్ ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చిందన్నారు. అదే విధంగా విదేశాల్లోని నల్లధనాన్ని తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని ప్రకటించారని చెప్పారు.

రూ. 50కే లీటర్ పెట్రోల్ ఇస్తామన్నారని సీతక్క గుర్తు

చేశారు. కానీ పెట్రోల్ ధరలు ఇష్టారాజ్యంగా పెంచారంటూ కేంద్రంపై నిప్పులు చెరిగారు. విభజన హామీలు నెరవేర్చకుండా పట్టిగా ప్రసంగిస్తే ఏం ఉపయోగం అంటూ బీజేపీ నేతలకు ఈ సందర్భంగా సీతక్క చురకలంటించారు. తెలంగాణ ప్రజలు చెల్లించే పన్నులు కావాలి కానీ.. ఆ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు మాత్రం పట్టవా అంటూ బీజేపీ నేతలను ఈ సందర్భంగా నిలదీశారు.

గత ప్రభుత్వ తీరు వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని సీతక్క స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆర్థిక చేయూతతో నాలుగు లక్షల 70 వేల మంది మహిళలు వ్యాపారాలు చేసుకుంటున్నారని వివరించారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేస్తామని సంకల్పంతో తాము పని చేస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఎగతాళి చేయడం మీకే చెల్లిందంటూ బీజేపీ శాసన సభ పక్ష నేత మహేశ్వరరెడ్డి తీరును ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఎండగట్టారు.

ట్రంప్ ప్రకటనతో ఒక్కసారిగా దిగిన చమురు ధరలు

న్యూఢిల్లీ, మార్చి 24: ఇరాన్ యుద్ధానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం కీలక ప్రకటన చేశారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేస్తున్నామని ప్రకటించారు. ట్రంప్ ప్రకటనతో ఒక్కసారిగా చమురు ధరలు దిగి వచ్చాయి. సోమవారం ఉదయం బ్రెంట్ క్రూడాయిల్ ధర 114 డాలర్లకు చేరింది. ట్రంప్ ప్రకటన తర్వాత ఏకంగా 13 శాతం తగ్గి 97 డాలర్లకు చేరుకుంది. అయితే ట్రంప్ ప్రకటనకు ముందు చమురు మార్కెట్లలో రూ.5,400 కోట్ల ట్రేడింగ్ జరగడం అనుమానాస్పదంగా మారింది

న్యూయార్క్ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 6.50 గంటల సమయంలో బ్రెంట్ క్రూడ్, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్‌తో సంబంధం ఉన్న దాదాపు 6,200 ఫ్యూచర్ కాంట్రాక్టులు ట్రేడ్ అయ్యాయి. చమురు ధరలు తగ్గుతాయని, స్టాక్ మార్కెట్లు పెరుగుతాయని ఈ కాంట్రాక్టులతో ట్రేడర్లు బెట్టింగ్ చేశారు. ఈ బెట్టింగ్ విలువ దాదాపు 580 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.5400 కోట్లు) ఉంటుందని అంచనా. ఈ ట్రేడింగ్ జరిగిన కేవలం 15 నిమిషాల తర్వాత ఇరాన్‌పై దాడులను వాయిదా వేస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు

ట్రంప్ ప్రకటనను ముందే ఊహించి భారీ స్థాయిలో ట్రేడింగ్ జరగడం చాలా అనుమానాలకు తావిస్తోంది ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీని వెనుక ఒకే సంస్థ ఉందా.. లేదా ఎక్కువ మంది ట్రేడింగ్ చేశారా అనే విషయంలో క్లారిటీ లేదు. అయితే ఈ ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలను అమెరికా ప్రభుత్వం ఖండించింది. ఆ ఆరోపణలు నిరాధారమైనవని, పూర్తిగా అసత్యాలని వైట్‌హౌస్ ప్రకటించింది.

లోక్‌సభ సీట్ల పెంపు.

న్యూఢిల్లీ, మార్చి 24:త్వరలో అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను, అలాగే పార్లమెంట్ స్థానాలను కేంద్రం పెంచబోతున్న సంగతి తెలిసిందే. అటు అసెంబ్లీలలో, ఇటు పార్లమెంట్‌లో 50 శాతం సీట్లను కేంద్రం పెంచబోతుంది. అలాగే, 2029 ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ కోటాను కూడా అమలు చేయనున్నారు. ఇక ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 ఎంపీ సీట్లు 816 సీట్లుగా మారుతాయి. తెలంగాణ అసెంబ్లీకి సంబంధించి 119 స్థానాలుండగా, ఈ సంఖ్య 2029లో 179కి చేరుతుంది.తెలంగాణ పర్యాటకం

అలాగే తెలంగాణలో ప్రస్తుతం 17 ఎంపీ స్థానాలుండగా, వీటి సంఖ్య 26కు చేరనుంది. ఎంపీ సీట్లకు సంబంధించి ఏ రాష్ట్రానికి ఎన్ని స్థానాలు దక్కుతాయో చూద్దాం. యూపీలో ప్రస్తుతం ఉన్న 80 ఎంపీ సీట్లు 120కి, మహారాష్ట్రలో 48 నుంచి 72కు, పశ్చిమ బెంగాల్‌లో 42 నుంచి 63కు, బిహార్‌లో 40 నుంచి 60కి, మధ్యప్రదేశ్‌లో 29 నుంచి 44కు, రాజస్థాన్‌లో 25 నుంచి 38కి, గుజరాత్‌లో 26 నుంచి 39కి, ఒడిశాలో 21 నుంచి 32కి, ఝార్ఖండ్‌లో 14 నుంచి 21కి, అసోంలో 14 నుంచి 21కి, పంజాబ్‌లో 14 నుంచి 21కి, ఛత్తీస్‌గడ్‌లో 11 నుంచి 17కు, హరియాణాలో 10 నుంచి 15కు, ఢిల్లీలో 7 నుంచి 11కు, జమ్మూ-కాశ్మీర్‌లో 5 నుంచి 8కి, ఉత్తరాఖండ్‌లో 5 నుంచి 8కి సీట్లు, హిమాచల్ ప్రదేశ్‌లో 4 నుంచి 6కు, గోవాలో 2 నుంచి 3 సీట్లకు పెరగనుండగా, అరుణాచల్ ప్రదేశ్, నిక్కిం, మిజోరం, మణిపూర్, త్రిపుర, మేఘాలయ రాష్ట్రాలు అన్నింట్లో రెండేసి సీట్లుండగా, ఇప్పుడు 3 సీట్లు అవుతాయి. అంటే కేంద్ర పాలిత ప్రాంతాలు, చిన్న రాష్ట్రాల్లో ఇప్పటిదాకా 20 ఎంపీ సీట్లుండగా, ఇకపై 30 సీట్లు అవుతాయి.

ఇక దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి తెలంగాణలో 17 నుంచి 26కు, తమిళనాడులో 39 సీట్లుండగా 59కి, కర్ణాటకలో 28 సీట్లుండగా 42కు, ఏపీలో 25 సీట్ల నుంచి 38కి, కేరళలో 20 నుంచి 30కి పెరుగుతాయి. అలాగే నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు కూడా వర్తిస్తాయి. ఇప్పటివరకు లోక్‌సభలో 84 ఎస్సీ రిజర్వుడ్ సీట్లుండగా వీటి సంఖ్య 126కు పెరగనుంది. అలాగే, 47 ఎస్టీ సీట్లుండగా, 70 సీట్లకు పెరగనుంది. 2011 నాటి జనాభా లెక్కలను ఆధారంగా తీసుకుని సీట్ల సంఖ్యను కేంద్రం పెంచబోతుంది. దీనికి సంబంధించిన సవరణ బిల్లును కేంద్ర త్వరలోనే పార్లమెంట్‌లో ప్రవేశబెట్టబోతుంది.

హైదరాబాద్‌లో దంచికొట్టిన వర్షం

హైదరాబాద్, మార్చి 24: నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. కూకట్‌పల్లి, చందానగర్, మియాపూర్ ప్రాంతాల్లో గట్టిగా వర్షం కురిసింది. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక సూరారం, కొంపల్లి, దుండిగల్ ప్రాంతాల్లో కూడా వోన్తరు వర్షపాతం నవోదైంది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. ఎండలతో ఇబ్బంది పడుతున్న నగర ప్రజలకు ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది.

అయితే, వర్షం కారణంగా ట్రాఫిక్ రద్దీ పెరిగింది. ముఖ్యంగా ప్రధాన రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల మేరకు రాబోయే గంటల్లో కూడా నగరంలో మరిన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని, వర్షం సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

ఒకవైపు శాంతి చర్చలు.. మరోవైపు దాడులు.. ఇరాన్ నగరాలపై బాంబుల వర్షం..

న్యూఢిల్లీ, మార్చి 24:ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజులు వాయిదా వేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగానే అంతర్జాతీయంగా కాస్త ఉపశమనం నెలకొంది. పలు దేశాల స్టాక్ మార్కెట్లు లాభాలు ఆర్జించాయి. చమురు ధరలు తగ్గాయి. యుద్ధం విషయంలో ట్రంప్ కాస్త వెనక్కి తగ్గినా ఇరాన్‌పై దాడులు మాత్రం ఆగడం లేదు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన తర్వాత కూడా ఇరాన్ నగరాలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. మంగళవారం రాత్రి ఇరాన్‌లోని పలు నగరాలపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో మంగళవారం రాత్రి భారీ పేలుళ్లు సంభవించాయి. తబ్రిజ్, ఇస్ఫహాన్, కరాజ్ నగరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. ఇస్ఫహాన్‌లోని గ్యాస్ వ్యవస్థ, ఖొర్రమ్‌షహర్‌లోని పవర్ ప్లాంట్‌లను క్షిపణులు, డ్రోన్లు తాకాయి. ఈ దాడులను ఇజ్రాయెల్ చేసి ఉంటుందని ఇరాన్ భావిస్తోంది. ఈ దాడులపై అమెరికా, ఇజ్రాయెల్ ఇప్పటివరకు స్పష్టతనివ్వలేదు

మరోవైపు ఇజ్రాయెల్‌పై 78వ విడత దాడులను ప్రారంభించినట్టు ఐఆర్‌జీసీ తాజాగా ప్రకటించింది ఇజ్రాయెల్‌లోని టెల్ అవివ్, డిమోనా, ఇలాట్‌తో పాటు పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నట్టు తెలిపింది. ఈ దాడుల్లో ఇజ్రాయెల్‌కు చెందిన పలు ప్రాంతాలు ధ్వంసమైనట్టు పేర్కొంది. మంగళవారం ఉదయం నుంచి పలు ఇజ్రాయెల్ నగరాల్లో సైరన్ల మోత మోగుతోంది.

దేశవ్యాప్తంగా జాతీయ పామ్ బోర్డు ఏర్పాటు చేయాలి..!

హైదరాబాద్, మార్చి 24: దేశవ్యాప్తంగా జాతీయ స్థాయిలో పామ్ బోర్డు ఏర్పాటు చేసి, పామ్ చెట్ల నుండి లభించే ఉత్పత్తులను ప్రోత్సహించాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. పామ్ చెట్ల నుండి బెల్లం, ఇతర ఉప ఉత్పత్తులను తయారు చేసి, వాటితో పిల్లలకు ఆరోగ్యకరమైన చాక్లెట్లు, బిస్కెట్లు.. అలాగే ఆర్గానిక్ ఆహార పదార్థాలు తయారు చేయాలని ఆయన సూచించారు.

అఖిల భారతీయ కల్వార్ కలాల్ కళార్ మహాసభకు హాజరైన శ్రీనివాస్ గౌడ్ తెలంగాణలో మాదిరిగా దేశంలోని అన్ని రాష్ట్రాలలో వైన్ షాపులలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. రసాయన కూల్‌డ్రింక్స్‌కు బదులుగా ఆరోగ్యకరమైన పానీయాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ రంగం ప్రధానంగా కులవృత్తులపై ఆధారపడి నడుస్తున్నందున దీనిని ఒక ప్రత్యేక పరిశ్రమగా గుర్తించి, ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉందని శ్రీనివాస్ గౌడ్ అభిప్రాయపడ్డారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా రా కేఫ్‌లు, నీరా ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుతో పాటు వైన్ షాపుల్లో రిజర్వేషన్లు, ఎక్స్‌గ్రేషియా పంపిణీ వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు శ్రీనివాస్ గౌడ్‌ను నేపాల్ ప్రతినిధులు, అఖిల భారతీయ కల్వార్ కలాల్ కళార్ మహాసభ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బ్లోగట్ కిశోర్ కుమార్ భగత్, అధ్యక్షుడు మనిష్ రాయ్, ప్రధాన కార్యదర్శి కిశోర్ భగత్, కోశాధికారి శివ ప్రసాద్ జైస్వాల్, తదితరులు పాల్గొన్నారు.

పీజీ మెడికల్ సీట్లపై సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం

హైదరాబాద్, మార్చి 24:తెలుగు రాష్ట్రాల్లోని పీజీ వైద్య విద్యార్థులకు, ముఖ్యంగా మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కోసం ఎదురుచూస్తున్న వారికి సుప్రీం కోర్టు తీర్పు పెద్ద షాక్‌గా మారింది. పీజీ వైద్య సీట్ల భర్తీకి సంబంధించి కౌన్సెలింగ్ గడువును పొడిగించే ప్రసక్తే లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తెలుగు రాష్ట్రాల్లో మిగిలిపోయిన పీజీ వైద్య సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ గడువును పొడిగించాలని దాఖలైన పిటిషన్లను జస్టిస్ పీఎన్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. నేషనల్ మెడికల్ కమిషన్ వాదనలతో ఏకీభవిస్తూ కోర్టు ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

ఇప్పటికే ఏడు రౌండ్ల కౌన్సెలింగ్ నిర్వహించామని, ఇంతకంటే ఎక్కువ రౌండ్లు నిర్వహించడం సాధ్యం కాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. కౌన్సెలింగ్ ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తే విద్యా క్యాలెండర్ దెబ్బతింటుందని, ఇది వైద్య విద్య నాణ్యతపై ప్రభావం చూపుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రతి సంవత్సరం కొన్ని సీట్లు మిగిలిపోవడం సహజమేనని, ముఖ్యంగా ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో అధిక ఫీజుల కారణంగా సీట్లు మిగిలిపోతాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

ఈ కేసులో ఎన్ఎంసీ తన నివేదికను సమర్పిస్తూ కౌన్సెలింగ్ పొడిగింపును తీవ్రంగా వ్యతిరేకించింది. మిగిలిపోయిన సీట్లలో అత్యధికం ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు చెందినవేనని, ప్రభుత్వ సీట్లు దాదాపు భర్తీ అయ్యాయని వివరించింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల ప్రకారం, నిర్దేశించిన తేదీ దాటిన తర్వాత అడ్మిషన్లు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది.

ఇరాన్‌తో యుద్ధం వేళ మోదీకి ట్రంప్ ఫోన్.. హార్ముజ్ జలసంధి సహా కీలక అంశాలపై చర్చ

న్యూఢిల్లీ, మార్చి 24: ఇరాన్‌తో యుద్ధం జరుగుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్ చేశారు. ఇరాన్ యుద్ధం సహా పశ్చిమాసియా పరిస్థితులు, హార్ముజ్ జలసంధి వంటి అంశాలపై చర్చలు జరిపారు. ఈ విషయాన్ని మంగళవారం ఇటు ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పేర్కొనగా, అటు అమెరికా తరఫున ఇండియాలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు.

ఆహ్వానం

శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ &
జి.ఎస్.ఆర్. & ఫ్రెండ్స్ ఈవెంట్స్
సంయుక్త ఆధ్వర్యంలో
వివిధ రంగాల ప్రముఖులకు

శ్రీ పరాభవ నామ ఉగాది ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం మరియు సినీ సంగీత కార్యక్రమం

తేది : 26-03-2026 శనివారం సా॥ 3 గం॥ల నుండి
వేదిక : కళా లలిత కళావేదిక, శ్రీత్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్

ముఖ్యఅతిథి : శ్రీ బి.ఎస్.రావు, శ్రీ మానస సలహాదారులు
సభాధ్యక్షులు : డా॥ లలిత వాణి, ప్రముఖ విద్వాంసుడు
విశిష్ట అతిథి : డా॥ పద్మనాగరాజు, ప్రముఖ కవయిత్రి

పురస్కార గ్రహీతలు

డా॥ నర్మదా రెడ్డి, ప్రముఖ రచయిత్రి, ప్రపంచ పర్యాటకురాలు
శ్రీ సద్గురు దామోదరాచార్య, ప్రముఖ రచయిత, ఆధ్యాత్మిక వేత్త
శ్రీ రాజ్ మురారి, సీరియల్ దర్శకులు
శ్రీ యల్లేశ్, రేడియో జాకీ, మిమిక్రీ ఆర్టిస్టు, గాయకులు
శ్రీ కావ్యసుధ, ప్రముఖ రచయిత

జి.ఎస్.ఆర్. కార్యదర్శి, జి.ఎస్.ఆర్. & ఫ్రెండ్స్ ఈవెంట్స్
శ్రీమతి కోకా భవాని కన్వీనర్, మానస
రఘుశ్రీ కార్యదర్శి, మానస

డిజిటల్ ఏఐ యుగంలో బానిసత్వ దురాచారం అవమానకరం !

(25 మార్చి "అంతర్జాతీయ ట్రాన్స్-అట్లాంటిక్ బానిస వ్యాపార బాధితుల జ్ఞాపకార్థ దినం" సందర్భంగా)

ప్రపంచ చరిత్రలో 16 - 18వ శతాబ్ద కాలంలో ఆఫ్రికా నుంచి సెంట్రల్/మిడిల్ అమెరికాకు బలవంతంగా అమాయక ఆఫ్రికన్లను తరలించి బానిసలుగా సంకెళ్లు వేసి, వెట్టిచాకిరీ చేయించిన దుర్మార్గపు ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఈ దుర్ఘటన "ట్రాన్స్అట్లాంటిక్ బానిసత్వ వ్యాపారం"గా చరిత్ర పుటల్లోకి చేరింది. ఈ విషాదకర ఘటన ప్రభావం నేటికీ ఆఫ్రికన్ల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. యూఎస్‌లో 01 ఫిబ్రవరి 1865న బానిసత్వాన్ని నిషేధించడం జరిగినప్పటికీ జాతి వివక్ష, బానిస బతుకుల ప్రభావం నేటికీ ఆఫ్రికన్ సమాజంపై పడుతూనే ఉంది. 2007లో ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 25 మార్చిన "అంతర్జాతీయ ట్రాన్స్అట్లాంటిక్ బానిస వ్యాపార బాధితుల జ్ఞాపకార్థ దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. అమానవీయ బానిసత్వం నేరమని, మానవ హక్కుల ఉల్లంఘనలు ఆక్షేపణీయం అని, జాతి వర్ణ వర్గ వివక్ష దురాచారమని, మనిషిని మనిషిగా చూడడం మన కనీస బాధ్యత అని అవగాహన కల్పించడం జరుగుతోంది. అగ్రదేశాల హోటల్స్, రెస్టారెంట్లు, సెలూన్లు, వ్యవసాయ పనులు, సంగీత కార్యక్రమాల్లో బానిసత్వ దురాచారం నేటికీ కొనసాగుతున్నది.

భారతంలో బానిసత్వ దురాచారం:

ప్రపంచంలోనే అత్యధికంగా 39 శాతం ఆధునిక బానిసలు భారత్‌లోనే ఉన్నారని తెలుస్తోంది. ముస్లిమ్ పాలనలో బానిసత్వం పెరగడం, నేటి డిజిటల్ వెలుగుల్లో కూడా బానిసత్వ చీకట్లు కమ్మడం సోచనీయం. 1843లో భారత్ బానిసత్వ చట్టం అమలులోకి రావడం జరిగినా దాని ప్రభావం అంతగా పౌర సమాజంపై పడకపోవడం దురదృష్టకరం. 2018 నివేదిక వివరాల ఆధారంగా ప్రపంచంలో 46 మిలియన్ల బానిసలు ఉండగా, అందులో 8 మిలియన్లు భారత్‌లోనే ఉండడం విచారకరం. వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా, బలవంతపు భిక్షాటన, బాల్య వివాహాలు, బలవంతపు పడుపు వృత్తి, బాల కార్మిక వ్యవస్థ లాంటివి నేటికీ మన సమాజంలో కనిపించడం బాధాకరం. ఇండియాలో ప్రతి వెయ్యి మందిలో ఆరుగురు బానిస చీకటి బతుకులు బతుకుతున్నట్లు తేలింది.

ఇటుక బట్టీలు, చిరు పరిశ్రమలు, వ్యవసాయం, అసంఘటిత రంగాలు, గృహ సంబంధిత పనులు, బాల్య బానిసత్వ దురాచారాల్లో ఆధునిక బానిసత్వ కదలికలు కనిపిస్తున్నాయి. ఆధునిక బానిసత్వానికి అడ్డుకట్ట వేయడానికి కఠినంగా చట్టాల అమలు, ప్రజల్లో చైతన్యం, బడాబాబుల ఆలోచనల్లో మార్పు రావలసి ఉన్నది. ప్రజల ఆకలిని ఆసరాగా తీసుకొని అమానవీయ బానిసత్వ బంధీఖానాలో కట్టిపడేయడం మూర్ఖత్వం, నేర సమానం. అందరం చేయి చేయి కలిపి మానవ హారం పట్టి బానిసత్వ కోరల్లో చిక్కి విలవిల్లాడుతున్న అమాయక జీవులకు స్వేచ్ఛను కల్పించి బానిసలు కానరాని ప్రపంచాన్ని నిర్మించుకుందాం, అందరి ముఖాల్లో ఆనంద హరివిల్లులు వికసింపజేద్దాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

భారత్ నేడు సవాళ్లను అధిగమిస్తూ నూతన విశ్వాసంతో ముందుకు సాగుతోంది: ప్రధాని

న్యూఢిల్లీ, మార్చి 24:' భారత్ - ప్రపంచం' ఇతివృత్తంతో టీవీ9 నెట్‌వర్క్ ఈ రోజు నిర్వహించిన సదస్సులో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అసాధారణ, క్లిష్ట పరిస్థితులను ఆయన ప్రస్తావించారు. ఇలాంటి కీలక సమయంలో ఆలోచనల మార్పిడికి ఒక వేదికను సిద్ధం చేసిన టీవీ9 నెట్‌వర్క్‌ను ప్రధాని అభినందించారు. "నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న పరిస్థితులు అసాధారణమైనవి. అత్యంత క్లిష్టమైనవి. ఇలాంటి సమయంలో ఆలోచనల మార్పిడికి టీవీ9 నెట్‌వర్క్ ఒక ముఖ్యమైన వేదికను సిద్ధం చేసింది" అని శ్రీ మోదీ అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, వివాదాలు నెలకొన్న తరుణంలో భారత్ స్థానం గురించి ప్రధానమంత్రి మాట్లాడుతూ, 2014 నాటి పరిస్థితులను అధిగమించి, భారత ఆర్థిక వ్యవస్థ నేడు సరికొత్త ఆత్మవిశ్వాసంతో శీఘ్రగతిన ముందుకు సాగుతోందని చెప్పారు. కరోనా మహమ్మారి తర్వాత సవాళ్లు పెరుగుతున్నా, 140 కోట్ల మంది పౌరుల ఐక్యత వల్లే భారత్ ప్రతి సవాల్ ను ఎదుర్కోగలిగిందని ఆయన పేర్కొన్నారు. "ఫిబ్రవరి 28 నుంచి ఈ 23 రోజుల్లో భారత్ తన సంబంధాల బలోపేత శక్తిని, నిర్ణయాత్మక సామర్థ్యాన్ని, సంక్షోభ నిర్వహణ దక్షతను చాటి చెప్పింది'' అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ప్రపంచ దేశాల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ భారత్ తన దౌత్య సంబంధాలతో గల్ఫ్ దేశాల నుంచి పాశ్చాత్య దేశాల వరకు, గ్లోబల్ సౌత్ నుంచి పొరుగు దేశాల వరకు అందరికీ నమ్మకమైన భాగస్వామిగా నిలుస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. భారత్ ఏ పక్షాన ఉంటుందనే ప్రశ్నకు సమాధానం ఇస్తూ, ' మేం భారత్ పక్షాన ఉంటాం. భారత ప్రయోజనాల వైపు ఉంటాం. మాది శాంతి, చర్చల మార్గం" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ప్రపంచ సరఫరా వ్యవస్థలు కుప్పకూలుతున్న సమయంలో భారత ప్రత్యామ్నాయ నమూనా, అధిగమించే శక్తి గురించి ప్రధానమంత్రి వివరించారు. ఇంధనం, ఎరువులు లేదా నిత్యావసర వస్తువుల సరఫరా విషయంలో పౌరులకు ఎక్కువ ఇబ్బందులు కలగకుండా నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. "వైవిధ్యం, దృఢత్వం విషయంలో భారత్ ఒక నమూనాను చూపింది. మన ప్రజలు కష్టాల బారిన పడకుండా చూడటమే మా నిరంతర లక్ష్యం" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు. .

పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు భారత్ పై చూపే ప్రభావం గురించి ప్రధానమంత్రి మాట్లాడుతూ, ఈ రోజు ఉదయం లోక్‌సభలో తాను చేసిన ప్రకటనను ప్రస్తావించారు. నేటి పరస్పర అనుసంధాన ప్రపంచంలో యుద్ధాలు భౌగోళికంగా భారత దేశ సరిహద్దులకు దూరంగా జరుగుతున్నప్పటికీ, వాటి ప్రతికూల ప్రభావాల నుంచి ఏ దేశమూ తప్పించుకోలేదని ఆయన పేర్కొన్నారు. ''ఇది సంయమనం, సున్నితత్వంతో వ్యవహరించాల్సిన సమయం. దేశప్రజలందరూ ఐక్యంగా ఒక సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడు దాని ఫలితాలు ఎల్లప్పుడూ అర్థవంతంగా ఉంటాయి" అని అన్నారు.

ప్రపంచ కల్లోలాల మధ్య కూడా భారత అభివృద్ధి వేగం అంతరాయం లేకుండా కొనసాగుతోందని ప్రధాని తెలిపారు. ఫిబ్రవరి 28 నుంచి గడిచిన 23 రోజుల వివరాలను ప్రధాన మంత్రి ప్రస్తావించారు. ఢిల్లీ మెట్రో రైలు కీలక కారిడార్ల ప్రారంభోత్సవం, సిల్చార్ హై-స్పీడ్ కారిడార్, కొత్త కోట విమానాశ్రయానికి శంకుస్థాపన, మధురై విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించడం వంటి అంశాలను ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు. 100 ప్లగ్-అండ్-ప్లే ఇండస్ట్రియల్ పార్కుల ఆమోదం, 1,500 మెగావాట్ల అదనపు సామర్థ్యం కోసం 'స్మాల్ హైడ్రో పవర్ డెవలప్‌మెంట్ స్కీమ్'కు ఆమోదం, జల్ జీవన్ మిషన్‌ను 2028 వరకు పొడిగించడం వంటి అంశాలను ఆయన కూడా ప్రస్తావించారు. వీటితో పాటు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.18,000 కోట్లకు పైగా నిధులను రైతుల ఖాతాలకు నేరుగా బదిలీ చేయడం, ఎంఎస్ఎంఈలు, ఎగుమతిదారుల కోసం రూ. 500 కోట్ల ఉపశమన ప్యాకేజీ ప్రకటనను కూడా ఆయన పేర్కొన్నారు. "ఈ చర్యలన్నీ వికసిత్ భారత్ సాధన కోసం దేశం ఎంతో వేగంగా పని చేస్తోందనడానికి నిదర్శనం" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

మేనేజ్‌మెంట్ సూత్రాలను ఉటంకిస్తూ, "ఏది ప్రాధాన్యమో, దాని నిర్వహణ జరుగుతుంది" అనే ప్రసిద్ధ సామెతను ప్రధాన మంత్రి వివరించారు. అలాగే, "దేనికి ప్రాధాన్యం ఇస్తామో అది మెరుగుపడుతుంది. చివరికి అది మార్పు చెడుతుంది'' ఆయన పేర్కొన్నారు. హైవేల నిర్మాణ వేగం రోజుకు 11?12 కిలోమీటర్ల నుంచి దాదాపు 30 కిలోమీటర్లకు పెరిగిందని, ఓడరేవుల వద్ద షిప్ టర్నరౌండ్ సమయం 5?6 రోజుల నుంచి 2 రోజుల కంటే తక్కువకు తగ్గిందని, రిజిస్టర్డ్ స్టార్టప్‌ల సంఖ్య 400?500 నుంచి 2 లక్షలకు పైగా పెరిగిందని, ఎంబీబీఎస్ సీట్లు 50?55 వేల నుంచి 1.25 లక్షలకు పైగా పెరిగాయని; బ్యాంక్ ఖాతాలు 25 కోట్ల నుంచి 80 కోట్లకు పైగా (55 కోట్ల జన్ ధన్ ఖాతాలతో సహా) విస్తరించాయని, విమానాశ్రయాల సంఖ్య 70 కంటే తక్కువ నుంచి 160 కి పైగా పెరిగిందని ఆయన పేర్కొన్నారు. నేడు భారత్ శరవేగంతో దూసుకుపోతోంది. నేడు సంకల్పాలు విజయాలుగా మారుతున్నాయి" అని శ్రీ మోదీ అన్నారు.

ప్రస్తుతం చోటు చేసుకుంటున్న మార్పులను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఒకప్పుడు తూటాల శబ్దాలతో దద్దరిల్లిన అస్సాం, ఇప్పుడు సెమీకండక్టర్ యూనిట్‌కు నిలయంగా మారిందని, ఒడిశా సెమీకండక్టర్ల నుంచి పెట్రోకెమికల్స్ వరకు వివిధ రంగాలలో వృద్ధిని సాధిస్తోందని, బీహార్ లో గత దశాబ్ద కాలంలో ఐదుకి పైగా కొత్త వంతెనలు నిర్మించారని, ఉత్తరప్రదేశ్ మొబైల్ ఫోన్ల తయారీకి గ్లోబల్ హబ్‌గా మారిందని శ్రీ మోదీ వివరించారు. "గతంలో ఉన్న అభివృద్ధి అసమతుల్యతను భారత్ భవిష్యత్తు అవకాశాలుగా మారుస్తోంది'' అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

పశ్చిమ బెంగాల్ విషయానికి వస్తే, సంస్కృతి, విద్య, పరిశ్రమలు, వాణిజ్యానికి కేంద్రంగా ఆ రాష్ట్రానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను ప్రధానమంత్రి ప్రస్తావించారు. గత 11 ఏళ్లలో ఆ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ''పార్టీ ప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వడం అత్యవసరం. ఎందుకంటే రాజకీయాల కంటే దేశం, దాని అభివృద్ధి మిన్న" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

షహీద్ భగత్ సింగ్, షహీద్ రాజ్‌గురు, షహీద్ సుఖ్‌దేవ్ అత్యున్నత త్యాగాలు చేసిన చారిత్రాత్మక దినమైన షహీద్ దివస్, డాక్టర్ రామ్ మనోహర్ లోహియా జయంతి సందర్భంగా ప్రధానమంత్రి వారికి నివాళులర్పించారు. ఈ మహనీయులు ఎల్లప్పుడూ వ్యక్తిగత జీవితాల కంటే దేశానికే ప్రాధాన్యత ఇచ్చి స్ఫూర్తి ప్రదాతలయ్యారని అన్నారు.

భారత ఏఐ విధానం జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా ఉందంటూ వివరిస్తున్న వ్యాసాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మార్చి 24:కృత్రిమ మేధో ఆధారిత నేటి సాంకేతిక రంగంలో వస్తున్న ఆవిష్కరణల విజయాలను వివరిస్తూ కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రజలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు పంచుకున్నారు.

కృత్రిమ మేధ రంగంలో భారత్ దృక్పథం జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా ఉంటూనే ప్రపంచ స్థాయి భాగస్వామ్యాలతో బలంగా ముడిపడిందని ఈ వ్యాసంలో స్పష్టం చేశారు. భారత ఏఐ వ్యూహం స్పష్టంగా, మానవ ప్రయోజనాలకు పెద్దపీట వేసేదిగా, అన్ని వర్గాలను కలుపుకొని పోయేదిగా, అంతర నిర్వహణీయమైందిగా ఉండడంతో పాటు సార్వభౌమ సామర్థ్య పునాదిపై నిర్మితమైందని ఈ వ్యాసంలో పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ఒక సందేశాన్ని ప్రధాన మంత్రి శ్రీ మోదీ పొందుపరుస్తూ -

"ఏఐ చోదకశక్తిగా ముందుకుసాగుతున్న సాంకేతిక యుగంలో, భారత్ ఆవిష్కరణల గాథ ప్రపంచ భాగస్వామ్యాలతోనూ లోతుగా అనుసంధానమైందని కేంద్ర మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ అంటున్నారు.

ఏఐ పట్ల భారత్ అనుసరిస్తున్న వైఖరి జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా ఉంది. అది స్పష్టంగానూ, మానవ ప్రయోజనాలకు పెద్ద పీట వేసేదిగానూ, అన్ని వర్గాలను కలుపుకొని పోయేదిగానూ, అంతర నిర్వహణీయమైందిగానూ, సామర్థ్యం పరంగా చూసినప్పుడు సార్వభౌమాధికారంతో కూడుకొన్నదిగానూ ఉందని ఆయన స్పష్టం చేస్తున్నార"ని పేర్కొన్నారు.

దేవీ ఆరాధనతో ప్రాప్తించే దివ్య వాతావరణాన్నీ, ఆధ్యాత్మిక ఆనందాన్నీ ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మార్చి 24:నవరాత్రులకు ఉన్న ఆధ్యాత్మిక ప్రాముఖ్యం విషయంలో స్వీయ ఆలోచనల్ని ప్రజలతో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు పంచుకున్నారు. దేవీ మాత ఆరాధనతో అపార శాంతీ, శక్తీ లభిస్తాయని స్పష్టం చేశారు. దేవిని స్తుతించే ఒక భక్తి గీతాన్ని శ్రీ మోదీ పంచుకున్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సందేశాన్ని ప్రధాన మంత్రి శ్రీ మోదీ పొందుపరుస్తూ -

''మా అంబే ఆరాధనతో భక్తిపూర్వక అద్భుత ఆనందాన్ని పొందవచ్చు. ఈ మార్గాన్ని అనుసరించడం వల్ల మనస్సుకు అంతులేని శాంతితో పాటు ఆత్మశక్తి కూడా లభిస్తుంద"ని పేర్కొన్నారు.

విద్యతో ఉన్నత స్థాయికి : ఎంఈఓ కత్తుల అరుంధతి

నల్గొండ, మార్చి 24 విద్యతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, అందుకు క్రమశిక్షణతో ముందుకు సాగాలని నల్లగొండ ఎంఈఓ కత్తుల అరుంధతి అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలో గల ది మాస్టర్ మైండ్స్ హై స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో యూకేజీ, ఐదవ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం యూకేజీ (39), ఐదవ తరగతి (18) విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ గుండెబోయిన జానయ్య యాదవ్, ఉపాధ్యాయులు జి.వెంకటేష్, క్రిస్టోఫర్, అరుణజ్యోతి, విజయనిర్మల, రుచిత, నూర్, అశ్విని, ఆస్మా, సనోబర్, దివ్య, స్వర్ణ, హేమలత, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రక్షణ అధికారులకు 'కార్పొరేట్ పాలనలో డైరెక్టర్ సర్టిఫికేషన్ కోర్సు' నాలుగో బ్యాచ్ శిక్షణ విజయవంతం

న్యూఢిల్లీ, మార్చి 24:గురుగ్రామ్‌లోని మనేసర్‌లోగల ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసీఏ) సంస్థ 'కార్పొరేట్ పాలనలో డైరెక్టర్ సర్టిఫికేషన్ కోర్సు'లో రక్షణ రంగ అధికారుల నాలుగో బ్యాచ్ శిక్షణను ఈ నెల 20న విజయవంతంగా పూర్తిచేసింది. రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ రీసెటిల్మెంట్ (డీజీఆర్)తో సంయుక్తంగా 'ఐఐసీఏ' ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఈ రెండు వారాల కార్యక్రమంలో భారత సాయుధ దళాల్లోని మూడు విభాగాల నుంచి 30 మంది సీనియర్ అధికారులు శిక్షణ పొందారు. 'ఐఐసీఏ'లో 2024 ఆగస్టు నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఇప్పటిదాకా 4 బ్యాచ్‌లలో మొత్తం 120 మంది అధికారులు శిక్షణ పొందారు.

సాయుధ దళాల్లో అధికారుల నాయకత్వ అనుభవాన్ని కార్పొరేట్ రంగ అవసరాలకు తగినట్లు మలచుకునేలా శిక్షణ ఇవ్వడమే ఈ కార్యక్రమ లక్ష్యం. ఇందులో భాగంగా కంపెనీలను నియంత్రించే చట్టాలు, నియంత్రణ చట్రాలు, స్వతంత్ర డైరెక్టర్ల బాధ్యతలు, ఆర్థిక పర్యవేక్షణ, ముప్పు నిర్వహణ, 'ఇఎస్‌జీ' సూత్రాలు సహా విశ్వసనీయ విధులపై వారికి అవగాహన కల్పిస్తారు.

అనుభవజ్ఞులు, ప్రస్తుతం ఈ రంగంలోగల స్వతంత్ర డైరెక్టర్లతో సంభాషణ తదితరాల ద్వారా ఈ కార్యక్రమం కార్పొరేట్ నాయకత్వ వాస్తవాలపై శిక్షణార్థులలో అనుభవపూర్వక అవగాహనను పెంచింది.

శిక్షణానంతరం మార్చి 19న నిర్వహించిన సర్టిఫికెట్ ప్రదానోత్సవంలో రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని మాజీ సైనికుల సంక్షేమ శాఖ (డీఈఎస్‌డబ్ల్యూ) కార్యదర్శి శ్రీమతి సుకృతి లిఖి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'ఐఐసీఏ' డైరెక్టర్ జనరల్-సీఈవో శ్రీ జ్ఞానేశ్వర్ కుమార్ సింగ్ దీనికి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా శ్రీ సింగ్ మాట్లాడుతూ- ఈ కార్యక్రమం కింద శిక్షణార్థి అధికారులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన సహా అనుభవజ్ఞులైన కార్పొరేట్ రంగ అగ్రగాములు, నిపుణులు, సహచరులతో వృత్తిగత సంబంధం ఏర్పరచుకునే అవకాశం లభిస్తుందన్నారు. ప్రస్తుత బాధ్యతల నుంచి వారు కార్పొరేట్ పాత్రలోకి మారినపుడు ఈ అనుభవపూర్వక శిక్షణ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా కార్పొరేట్ పాలన నాణ్యతను పెంచడంలో భాగంగా 'ఐఐసీఏ'తో పాటు తమలోతాము పరస్పర సంబంధాలు నెరపాల్సిందిగా ఇప్పటిదాకా శిక్షణ పొందిన రక్షణ అధికారులందరికీ ఆయన సూచించారు.రక్షణ అధికారుల పదవీ విరమణానంతరం వారికోసం అర్థవంతమైన మార్గాల అన్వేషణ లో 'ఐఐసీఏ', 'డీజీఆర్' మధ్య సహకారాన్ని 'డీఈఎస్‌డబ్ల్యూ' కార్యదర్శి శ్రీమతి సుకృతి లిఖి ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా కార్పొరేట్ పాలన సంబంధిత బాధ్యతలపై విజ్ఞానం, విస్తృత అవగాహన రెండూ కల్పించేలా 'ఐఐసీఏ' పోషిస్తున్న పాత్రను ఆమె కొనియాడారు.

ఈ కార్యక్రమం విస్తృత జాతీయ సంకల్పం 'వికసిత భారత్-2047'లో భాగమని ఆమె అభివర్ణించారు. కార్పొరేట్ పాలన పాత్రలో అనుభవజ్ఞులైన సైనికాధికారుల ప్రవేశం వృత్తిపరమైన మార్పిడికి పరిమితం కాదని, అది జాతీయ సేవను కొనసాగించడమేనని పేర్కొన్నారు. క్రమశిక్షణ, వ్యూహాత్మక దృక్పథం, నిజాయితీ, నిబద్ధత వంటి అనేక ఉత్తమ నాయకత్వ లక్షణాలను వీరు కార్పొరేట్ రంగంలోకి తెస్తారని గుర్తు చేశారు. తద్వారా మరింత బలమైన సంస్థలను, బాధ్యతాయుత వ్యవస్థలను రూపొందించడంలో తమవంతు సహకారం అందిస్తారని చెప్పారు. ప్రగతిశీల, పటిష్ఠ భారత దేశం కోసం ఇవి రెండూ అత్యావశ్యక మూలస్తంభాలని తెలిపారు. 'ఐఐసీఏ' స్కూల్ ఆఫ్ కార్పొరేట్ గవర్నెన్స్ అండ్ పబ్లిక్ పాలసీ విభాగాధిపతి, కార్యక్రమ సంచాలకుడైన డాక్టర్ నీరజ్ గుప్తా తొలుత సర్టిఫికేషన్ కోర్సు నేపథ్యాన్ని వివరించారు. ఇందులో భాగమైన వివిధ కార్యకలాపాలకు 'ఐఐసీఏ' ప్రిన్సిపల్ రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ అనిందితా చక్రవర్తి నాయకత్వం వహించారు.

అనాథ, వృద్ధాశ్రమాలకు శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కాలేజీ భారీ వితరణ

ఖమ్మం, మార్చి 24: ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్ లోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 25ద26 న జరిగే జాతీయస్థాయి టెక్నికల్ ఎకల్చరల్ ఫెస్ట్ శ్రీ చైతన్య ఉత్సవ్- 26 లో సామాజిక సేవ అనే అంశంలో భాగంగా మంగళవారం ఖమ్మం పట్టణంలోని 13 అనాథ అలాగే వృద్ధాశ్రమాలను సందర్శించి వారికి కావాల్సిన నిత్యావసర సరుకులు వితరణ ఇవ్వడం జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి నారాయణ తెలిపారు. బ్యాంక్ కాలనీలోని ఈశ్వరమ్మ ప్రశాంతి సదన్, జీవన్ సంధ్య ఆశ్రమం ఎన్ఎస్పి క్యాంప్, భవ్య శ్రీ ఓల్డేజీ హోమ్ నాయుడుపేట క్రాస్ రోడ్, మెఫీ స్వచ్ఛంద సేవా సంస్థ ఫర్ చిల్డ్రన్స్ పెద్ద తండా, నేనున్నాను ఓల్డ్ ఏజ్ హోమ్, మదర్ థెరిస్సా ఆశ్రమం బల్లేపల్లి, నేనున్నాను ఫౌండేషన్ ని కళాశాల విద్యార్థులు, సుమారు 500 మంది అనాథ, వృద్ధ ఆశ్రమాల్లో ఉన్న వారికి కావాల్సిన నిత్యవసర సరుకులు అందించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలోని స్థితిగతులపై విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులను అభినందిస్తూ, సమాజంలో వివిధ కారణాల చేత ఓల్డ్ ఏజ్ హోమ్స్ లో నివసిస్తున్న వారికి సహాయం చేయడం ద్వారా విద్యార్థులకి సమాజంలో వాస్తవ పరిస్థితులు అవగాహన చేసుకుని, ఎప్పుడూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై ప్రేమానురాగాలు చూపాలని కోరారు. కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యార్థులు చదువులోనే కాకుండా సమాజంలో అన్ని రంగాలలో ముందుండేలాగా ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డీన్ డాక్టర్ సుదర్శన్, ఏఓ వైశాలి, ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్ ఆఫీసర్ రాజేశ్, డిప్లొమా ఇన్‌చార్జి కృష్ణ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రణతి, డాక్టర్ చార్యులు, శ్రీకుమార్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాల్లో జానపద కళల ప్రదర్శన

న్యూఢిల్లీ, మార్చి 24:భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వానికి ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించేందుకు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ స్కీమ్ (జీఈఎస్)ను అమలు చేస్తుంది.

ఈ పథకం ద్వారా విదేశాల్లో జరిగే భారతీయ ఉత్సవాల్లో (ఎఫ్ఓఐలు) ప్రదర్శన ఇచ్చేందుకు వివిధ కళలకు సంబంధించిన కళాకారులు, బృందాలను మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. మంత్రిత్వ శాఖ వద్ద ప్రస్తుతం 627 కళాకారులు, బృందాలు నమోదవగా.. 31 మంది కళాకారులు, బృందాలు ఉత్తరప్రదేశ్‌కి చెందినవి.విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఐసీసీఆర్.. విదేశాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చేందుకు అయిదేళ్లలో 52 జానపద కళా బృందాలను పంపింది.

భారతీయ కళలు, సంస్కృతులకు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో విదేశాల్లోని ఇండో-ఫారిన్ ఫ్రెండ్‌షిప్ సొసైటీలకు భారత రాయబార కార్యాలయాల ద్వారా రూ.2.58 కోట్లను విడుదల చేశారు.

34.34 లక్షలకు పైగా కాల్స్ స్వీకరించి, సమస్యలను పరిష్కరించిన టెలిమానస్ హెల్ప్‌లైన్

న్యూఢిల్లీ, మార్చి 24:దేశ వ్యాప్తంగా నాణ్యమైన మానసిక ఆరోగ్యాన్ని అందించే దిశగా- కౌన్సెలింగ్, సంరక్షణ సేవలను మరింత అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు 2022 అక్టోబర్ 10న నేషనల్ టెలి మెంటల్ హెల్త్ ప్రోగ్రాంను భారత ప్రభుత్వం ప్రారంభించింది. 03.03. 2026 నాటికి దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో 53 టెలిమానస్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రాలు ఎంపిక చేసుకున్న భాష ఆధారంగా టెలిమానస్ సేవలు 20 భాషల్లో అందుబాటులో ఉన్నాయి. హెల్ప్ లైన్ సౌకర్యాన్ని ప్రారంభించిన నాటి నుంచి 34.34 లక్షల కాల్స్ స్వీకరించి, సమస్యలను పరిష్కరించారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 2024 అక్టోబర్ 10న టెలిమానస్ సేవల్ని సెల్ ఫోన్ ద్వారా పొందడానికి ఒక యాప్ ను ప్రారంభించారు. వివిధ రకాల మానసిక సమస్యల నుంచి బయటపడేందుకు తోడ్పాటునందించే సమగ్ర మొబైల్ వేదికగా టెలి-మానస్ మొబైల్ యాప్ అభివృద్ధి చేశారు. అత్యవసరం కాని వ్యక్తిగత సేవల కోసం 47,487 మందిని, తదుపరి వివరణాత్మక వైద్య మూల్యాంకనం కోసం 9,590 మందిని, మానసిక ఆరోగ్య నిపుణుల (ఎంహెచ్‌పీ) సేవలకు మరో 19,135 మందిని సిఫారసు చేశారు. స్థానికంగా నిరంతర సేవలను కొనసాగించడానికి 1,319 మంది జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం (డీఎంహెచ్‌పీ)లో పనిచేస్తున్నారు. బహుళ-విభాగాల నిపుణుల పర్యవేక్షణ అవసరమయ్యే కేసుల్లో 10,240 మంది వైద్య లేదా శస్త్రచికిత్స నిపుణుల వద్దకు పంపించారు. తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న 5,083 మందిని మానసిక ఆసుపత్రి అత్యవసర విభాగాలకు తక్షణమే పంపించగా, మరో 345 మందిని అధునాతన వైద్య సేవలు అందించడానికి వైద్య కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు పంపించారు.

అడాలసెంట్ ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్స్ (ఏఎఫ్‌హెచ్‌సీ), పీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ అండ్ అడాలసెంట్ హెల్త్ అండ్ వెల్‌నెస్ డేస్ (ఏహెచ్ అండ్ డబ్ల్యూడీ) తదితర కార్యక్రమాల ద్వారా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌కేఎన్‌కే) మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించి, కౌన్సెలింగ్ సేవలను అందిస్తుంది. 15-20 మంది బాలబాలికలతో బృందాలను ఏర్పాటు చేసి, మానసిక ఆరోగ్యం, సంక్షేమంతో సహా కౌమార దశ ఆరోగ్యంపై వారానికి ఒకటి నుంచి రెండు గంటల పాటు పీర్ ఎడ్యుకేటర్లు చర్చలను నిర్వహిస్తారు. ఆర్‌కేఎస్‌కే అనుసరించే వ్యూహంలో మానసిక ఆరోగ్యం ఒక సమగ్ర భాగం. దీనిలో కౌమార దశలో సాధారణంగా ఎదురయ్యే మానసిక ఆరోగ్య సమస్యలు, వాటిని అధిగమించడంపై వైద్యాధికారులు, ఏఎన్ఎమ్‌లు, కౌన్సిలర్లకు శిక్షణ కూడా ఉంది.

మానసిక ఆరోగ్యంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, కుటుంబాలకు ఆన్‌లైన్ వేదిక ద్వారా సూచనలను, దృశ్య-శ్రవణ వనరులను, భావోద్వేగ ఆరోగ్యంపై మార్గదర్శకత్వాన్ని విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న మనోదర్పణ్ అందిస్తుంది. విద్యాపరమైన ఒత్తిడి, మానసిక సమస్యలను అధిగమించడంలో విద్యార్థులకు సాయం చేసేందుకు సహయోగ్, పరిచర్చ లాంటి భాగస్వామ్య కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆయుష్మాన్ భారత్ పాఠశాల ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమం పరిధిలో "భావోద్వేగ శ్రేయస్సు - మానసిక ఆరోగ్యం"ను ఒక ప్రత్యేక మాడ్యూల్‌గా చేర్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఇతర అంశాలతో పాటుగా మానసిక ఆరోగ్యంపై శిక్షణ పొందిన ఆరోగ్యం, సంక్షేమ రాయబారులు (ఉపాధ్యాయులు) విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్లను నిర్వహిస్తారు. అలాగే ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకొనేలా వారాంతపు కార్యక్రమాలను నిర్వహిస్తారు.

పాఠశాలలు, కళాశాలలు, వనతి గృహాలు, ఐటీఐలు, విశ్వవిద్యాలయాలు, ఎన్జీవోలు, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు, ఆరోగ్య కేంద్రాలు, పని ప్రదేశాలు, వృత్తిపరమైన సమావేశాల్లో విస్తృతంగా ప్రచార, అవగాహనా కార్యక్రమాలను టెలిమానస్ బృందాలు చేపట్టాయి. భారతీయ రైల్వే లోకో పైలట్లు, వారి కుటుంబాలు, రిజర్వు పోలీసు సిబ్బంది, ఆదాయ పన్ను అధికారులు, నర్సింగ్, సోషల్ వర్కు విద్యార్థులు, ప్రాథమిక కౌన్సిలర్లు కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో వేల మంది పాల్గొన్నారు. కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్ రావ్ జాదవ్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంగా ఈ సమాచారాన్ని అందించారు.

క్షయ రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి : డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్

నల్గొండ, మార్చి 24: నల్లగొండను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓం పుట్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా మంగళవారం చందంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ రెండవ దశ వంద రోజుల కార్యక్రమంను అయన ప్రారంభించారు. డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉచిత మొబైల్ ఏఐ చెస్ట్ ఎక్స్ రే స్క్రీనింగ్ క్యాంప్స్ ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను ఆయన కోరారు.

అనంతరం జిల్లాలో క్షయ నిర్మూలన కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి అవార్డులు, ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ రాహుల్, డాక్టర్ దీప, వివిధ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ కృష్ణకుమారి, డాక్టర్ రవి ప్రసాద్, చందంపేట సర్పంచ్ మహ్మద్ సాదిక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ రాజేష్, జిల్లా క్షయ నివారణ కార్యక్రమం సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలతో పశువులను సంరక్షించుకోవాలి

నల్గొండ, మార్చి 24:గాలికుంటు వ్యాధి టీకాలతో పశువులను సంరక్షించుకోవాలని కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో టీకా జిల్లా ప్రచార రథాన్ని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ వ్యాధిపై పాడి రైతులకు అవగాహన కలిగించేందుకు రథం ఏర్పాటు చేయబడిందని తెలిపారు. గాలికుంటు టీకా కార్యక్రమం గ్రామ గ్రామాన పశు పోషకులకు ఉపకరిస్తుందన్నారు.. ఇక్కడి వైద్యులు మూగ జీవాలకు సకాలంలో చికిత్సను అందించడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బోడపూడి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తిరువతమ్మ, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మల్లీశ్వరి, అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య, కౌన్సిలర్ నాగేంద్రమ్మ, న్యాయవాది కే ఎల్ ఎన్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

'గ్యాస్' కు నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే కేసులు

-పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటీ రఘునందన్

నల్గొండ, మార్చి 24: గ్యాస్ కు నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే క్రిమినల్ కేసుల నమోదు తథ్యం అని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. మంగళవారం మునుగోడులో గ్యాస్ కు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్న సాయి దుర్గ గ్యాస్ ఏజెన్సీ వారిని ఆయన నిలదీశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువ వసూలు చేసే గ్యాస్ మాఫియాపై ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వినియోగదారులకు ఆయన తెలిపారు. ఎండలో గ్యాస్ వినియోగదారులను నిరీక్షణ చేయించడం భావ్యం కాదని పేర్కొన్నారు.

విపత్తుల నిర్వహణలో శ్రేష్ఠత్వాన్ని గుర్తిస్తున్న సుభాష్ చంద్ర బోస్ ఆపదా ప్రబంధన్ పురస్కార్

న్యూఢిల్లీ, మార్చి 24:సుభాష్ చంద్ర బోస్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా జనవరి 23న ప్రకటించే 'సుభాష్ చంద్ర బోస్ ఆపదా ప్రబంధన్ పురస్కార్' ఒక ప్రతిష్ఠాత్మక జాతీయ గౌరవం. విపత్తుల నిర్వహణ రంగంలో వ్యక్తులు, సంస్థలందించే అమూల్య సేవలను గుర్తింపుగా ఈ అవార్డును ఇస్తున్నారు. విపత్తులను నిరోధించే, విపత్తులను ఎదుర్కోవడానికి సన్నద్ధమయ్యే, విపత్తులకు ప్రతిస్పందించే, విపత్తుల నుంచి తిరిగి తేరుకునేలా దేశ శక్తియుక్తుల్ని పటిష్ఠపరిచే అసాధారణ కృషినీ, సర్వోత్తమ పద్ధతుల్నీ లోకానికి వెల్లడించాలనే సంకల్పంతో ఈ పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

విపత్తుల నిరోధం, విపత్తు ప్రసరించే ప్రభావాన్ని తగ్గించే దిశగా చర్యలు చేపట్టడం, విపత్తును సమర్థంగా ఎదుర్కోవడానికి సన్నద్ధం కావడం, విపత్తు వేళల్లో తగిన విధంగా ప్రతిస్పందన చర్యలు తీసుకోవడం, సహాయ-పునరావాస చర్యలు, పునర్నిర్మాణం, పరిశోధన, నూతన ఆవిష్కరణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థల కల్పన, సమాజాన్ని చైతన్యపరచడం, సామర్థ్యాలను పెంపొందించే చర్యలు సహా విపత్తు నిర్వహణకు సంబంధించిన అన్ని కోణాల్లోనూ అసాధారణ సేవలను అందించే వర్గాల్ని ఈ పురస్కారం గుర్తిస్తుంది. నూతన ఆవిష్కరణలనూ, ఉత్తమ పద్ధతులనూ వెన్ను తట్టి ప్రోత్సహించడం, సురక్షిత విపత్తు వేళ ఆటుపోటులకు తట్టుకుని నిలిచేదిగా భారత్ ను తీర్చిదిద్దే దిశగా తోడ్పడాల్సిందిగా వ్యక్తులకూ, సంస్థలకూ స్ఫూర్తిని అందించడం ఈ అవార్డు లక్ష్యాలు. విపత్తు నష్టభయాన్ని తగ్గించడంతో పాటు మానవతాపూర్వక ప్రతిస్పందనల్లో అసాధారణ ప్రయత్నాలను గుర్తించి పండగ చేసుకోవడం కోసం ఈ పురస్కారాన్ని ఉద్దేశించారు. ఇది విజయవంతమైన నమూనాలను లోకానికి వెల్లడి చేయడంలోనూ, జాతీయ విపత్తు విరుచుకుపడే సందర్భాల్లో మరింత ఎక్కువ మందికి ప్రేరణ ఇవ్వడానికి ఈ అవార్డు దోహదం చేస్తుంది.

ఈ పథకంలో జాబితాలో చేర్చిన ఆసుపత్రుల సంఖ్య ఫిబ్రవరి 28 నాటికి 36,229- వృద్ధి అయిదు రెట్లు

న్యూఢిల్లీ, మార్చి 24:ఆయుష్మాన్ భారత్ - ప్రధాన్ మంత్రీ జన్ ఆరోగ్య యోజన (ఏబీ-పీఎమ్‌జేఏవై) పథకంలో భాగంగా నమోదైన ఆసుపత్రులు అర్హత కలిగిన లబ్ధిదారులకు వైద్య చికిత్సను నిరాకరించరాదు.

చికిత్సను పొందడంలో ఏవైనా సమస్యలు ఎదురైనా, చికిత్స చేయడానికి ఆస్పత్రి నిరాకరించినా- లబ్ధిదారులు కేంద్రీకృత ఫిర్యాదు పరిష్కార నిర్వహణ వ్యవస్థ (సీజీఆర్ఎమ్ఎస్) దృష్టికిగానీ, హెల్ప్‌లైన్ సంఖ్య 14555 కి ఫోన్ చేసిగానీ ఫిర్యాదు చేయవచ్చును. ఫిర్యాదుల్ని ఏబీ-పీఎమ్‌జేఏవైలో భాగంగా జిల్లా, రాష్ట్రం, జాతీయ స్థాయుల్లోని మూడంచెల యంత్రాంగం పర్యవేక్షిస్తుంది. ప్రతి ఒక్క స్థాయిలోనూ ఫిర్యాదుల్ని పరిశీలించి, పరిష్కరించడానికి ప్రత్యేక నోడల్ అధికారులతో పాటు ఫిర్యాదు పరిష్కార సంఘాలను కూడా నియమించారు.

ఏబీ-పీఎమ్‌జేఏవై పథకం కిందికి అనేక ఆస్పత్రులను అందుబాటులోకి తెస్తున్నారు. పథకాన్ని అమలు చేసే రాష్ట్రం, లేదా కేంద్ర పాలిత ప్రాంతం.. జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ (నేషనల్ హెల్త్ అథారిటీ) నిర్దేశించిన ఎంప్యానల్‌మెంట్ మార్గదర్శకాల్లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా ఉన్న ఆసుపత్రులు లభ్యత, అవసరాల ఆధారంగా ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. ఈ పథకంలో, ప్రయివేటు ఆసుపత్రుల్ని జాబితాలో చేర్చే ప్రక్రియ పూర్తి స్వచ్ఛందంగా అమలవుతుంది.

ఈ పథకం కింద జాబితాలో చేర్చిన ఆసుపత్రుల సంఖ్య 2018-19 ఆర్థిక సంవత్సరంలో 6,917 ఆసుపత్రులుగా (వీటిలో 3,013 ప్రభుత్వ, 3,904 ప్రయివేటు) ఉండగా, 2026 ఫిబ్రవరి 28 నాటికి 36,229కి (వీటిలో 19,483 ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 16,746 ప్రయివేటు ఆసుపత్రులు) పెరిగాయి. దేశమంతటా విస్తరించిన ఈ 36,229 నమోదైన ఆసుపత్రుల్లో అర్హులైన లబ్ధిదారులు వైద్య చికిత్సను పొందవచ్చును.

ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలాఖరు నాటికి మొత్తం 11.69 కోట్ల ఆసుపత్రి ప్రవేశాలను ఆమోదించారు. వీటిలో 6.74 కోట్ల ప్రవేశాలు ప్రయివేటు ఆసుపత్రులకు సంబంధించినవి.

ఈ పథకంలో, క్లెయిముల సెటిల్‌మెంటు క్రమం తప్పక, నిర్నిరోధంగా సాగుతుంది. క్లెయిములను సంబంధిత రాష్ట్ర ఆరోగ్య ఏజెన్సీలు నేషనల్ హెల్త్ అథారిటీ జారీ చేసిన క్లెయిముల న్యాయ నిర్ణయ సంబంధిత మార్గదర్శకాల్ని అనుసరించి పరిష్కరిస్తాయి. క్లెయిములు సకాలంలో పరిష్కారం కావడానికి ఆమోదించిన టర్నరౌండ్ అవధిని అంతర్ రాష్ట్ర ఆసుపత్రుల (రాష్ట్రం లోపల నెలకొన్న ఆసుపత్రుల) విషయంలో క్లెయిమును సమర్పించిన 15 రోజుల లోపల, పోర్టబులిటీ క్లెయిముల (రాష్ట్రం బయట నెలకొన్న ఆసుపత్రుల) విషయంలో అయితే క్లెయిమును దాఖలు చేసిన 30 రోజుల లోపల గానూ నిర్ధారించారు. ఈ పథకంలో భాగంగా, జాబితాలో చేర్చిన ఆసుపత్రులు సమర్పించిన క్లెయిములను రోగచికిత్స సంబంధి పత్రాలు, పరీక్షా నివేదికలతో పాటు ఇతర సహాయక రికార్డులను ఆధారం చేసుకొని, నిర్దిష్ట ప్రామాణిక చికిత్స మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలిస్తారు.

ఈ సమాచారాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్ ఈ రోజు లోక్‌సభలో ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలియజేశారు.

జాతీయ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్) రెండు రోజుల సదస్సు ప్రారంభం

డీఎంఎఫ్ సదస్సును ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 24:న్యూఢిల్లీలోని స్కోప్ కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజుల పాటు జరిగే జాతీయ జిల్లా ఖనిజ ఫౌండేషన్ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్-డీఎంఎఫ్) సదస్సు 2026ను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ఈరోజు ప్రారంభించారు. ఈ సదస్సులో భాగంగా మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో డీఎంఎఫ్ పాత్రను వివరిస్తూ వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రభావవంతమైన కార్యక్రమాలు, విజయగాథలను ప్రదర్శించే ఎగ్జిబిషన్ను కూడా శ్రీ కిషన్ రెడ్డి ప్రారంభించారు.

గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ పీయూష్ గోయల్ సమక్షంలో ప్రారంభమైన ఈ రెండు రోజుల జాతీయ సదస్సులో సుస్థిర, సమ్మిళిత అభివృద్ధి కోసం డీఎంఎఫ్ నిధుల సమర్థవంతమైన వినియోగంపై చర్చించడానికి కీలక వాటాదారులందరూ పాల్గొంటున్నారు.

కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలోని సహజ వనరుల విషయంలో స్థానిక సమాజాల సహకారం ఎంతో ఉందని, వారికి తగిన ప్రయోజనాలు అందాలని స్పష్టం చేశారు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ, జీవనోపాధి పునరుద్ధరణ, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు.

గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ పీయూష్ గోయల్, మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు 200 మైనింగ్ బ్లాకులను వేలం వేసినట్లు తెలిపారు. ఈ రంగంలో కొనసాగుతున్న సంస్కరణల లక్ష్యం అభివృద్ధి ఫలాలు చివరి లబ్ధిదారుడి వరకు చేరేలా చూడటమేనని ఆయన పేర్కొన్నారు.

''ఆకాంక్షాత్మక జిల్లాల కార్యక్రమం (ఏడీపీ), ఆకాంక్షాత్మక బ్లాకుల కార్యక్రమం (ఏబీపీ) అమలు జరిగే ప్రాంతాల కోసం జిల్లా ఖనిజ ఫౌండేషన్ నిధుల సమర్థవంతమైన వినియోగం'' అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ సదస్సు, వివిధ పథకాల అనుసంధానం, పారదర్శకత, పర్యవేక్షణ ద్వారా ఫలితాల ఆధారిత వినియోగంపై దృష్టి సారించింది.

పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ సుశీల్ కుమార్ లోహాని 'పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్' పోర్టల్‌ను గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా తొమ్మిది ఇతివృత్తాల ఆధారంగా ఉన్న 435 సూచికల ద్వారా ఈ పోర్టల్ డేటా ఆధారిత పాలనను (సాధ్యం చేస్తుందని ఆయన వివరించారు.

నీతిఆయోగ్ అదనపు కార్యదర్శి శ్రీ రోహిత్ కుమార్ మాట్లాడుతూ, మూడు 'సీ' లు - సమన్వయం (కన్వర్జెన్స్), భాగస్వామ్యం (కొలాబరేషన్), పోటీ (కాంపిటీషన్) - మూడు 'ఎఫ్' లు ? నిధులు (ఫండ్స్), విధులు (ఫంక్షన్స్), నిర్వాహకులు (ఫంక్షనరీస్) ? ఆకాంక్షిత ప్రాంతాలను ప్రేరణాత్మక ప్రాంతాలుగా మార్చడానికి కీలక దోహదకారులని అన్నారు.

మొదటి రోజున, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలు తమ ఉత్తమ విధానాలను పంచుకున్నాయి. వివిధ పథకాల అనుసంధానం, సంతృప్త స్థాయి అమలు, అభివృద్ధి ప్రభావాన్ని గరిష్టంగా పెంచడం వంటి అంశాలపై ఈ రాష్ట్రాలు ప్రధానంగా దృష్టి సారించాయి.

సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి కోసం, వాటాదారుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, డీఎంఎఫ్ నిధుల సమర్థవంతమైన వినియోగాన్ని మెరుగుపరచడం ఈ సదస్సు ద్వారా సాధ్యమవుతుందని భావిస్తున్నారు.

సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మేఘాలయ, రాజస్థాన్, కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల డీఎంఎఫ్ లబ్ధిదారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. ప్రదర్శనను ప్రారంభించిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ కిషన్ రెడ్డి వారితో ముచ్చటించారు.

డ్యూటీకి మించి మానవత్వం చూపిన పోలీసులు

-ట్రాఫిక్ పోలీసుల మానవీయ కోణం
-సిగ్నల్ వద్ద చల్లని గ్రీన్ మ్యాట్ పందిరి ఏర్పాట్లు..
-ఎండలో నిలిచే వారికి ఉపశమన చర్యలు
-ట్రాఫిక్ పోలీసుల ప్రశంసిస్తున్న వాహనదారులు..

విజయవాడ మార్చి 24: ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో సిగ్నల్ వద్ద నిలిచే వాహనదారులకు ఉపశమనం కల్పించేందుకు ఆరవ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గౌరవనీయులైన ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఉత్తర్వుల మేరకు, ట్రాఫిక్ డీసీపీ షేక్ షరీన్ బేగం ఆదేశాలపై అజిత్ సింగ్ నగర్ పరిధిలోని డాబా కొట్లు సెంటర్ వద్ద గ్రీన్ మ్యాట్ షెడ్ ఏర్పాటు చేశారు.

సిగ్నల్ వద్ద వాహనదారులు ఎండలో ఎక్కువసేపు నిలబడే పరిస్థితి ఉండటంతో, వారికి చల్లని నీడ అందించాలనే ఉద్దేశంతో ఈ షెడ్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా మధ్యాహ్న వేళల్లో తీవ్ర ఎండ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ చర్య ఉపశమనంగా మారింది. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సువర్ణ రాజు, ఎస్ఐలు జే. కృష్ణ, నాగదుర్గతో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. డ్యూటీకి మించి ప్రజల సమస్యలను గుర్తించి స్పందించిన పోలీసుల ఈ చర్యను స్థానికులు అభినందిస్తున్నారు.

పిల్లలకు విద్య, ఆహారం, ఆరోగ్యాన్ని అందిస్తున్నాం

అమరావతి, మార్చి 24:ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటుగా ఆహారాన్ని, ఆరోగ్యాన్ని కూడా అందిస్తున్నామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్ సంజయ్‌గాంధీ నగర్‌లో ఉన్న దామోదర సంజీవయ్య నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన కార్యక్రమం అమలవుతున్న విధానాన్ని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మంగళవారం మధ్యాహ్నం స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ పాఠశాలకు వచ్చిన ప్రతి ఒక్క విద్యార్థికీ తమ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పుస్తకాలు, యనిఫామ్, బ్యాగ్‌లతో పాటుగా ప్రతి విద్యార్థికి రూ.15 వేలు తల్లికి వందనం పేరుతో అందచేశామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడమే కాకుండా ప్రతి రోజూ వారి మెనూను విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ నిర్దేశించి అమలు చేస్తున్నామన్నారు.

విద్యార్థులకు చదువుతో పాటుగా ఆరోగ్యాన్ని అందించేందుకు వైద్య శిబిరాలు, టీకాలు ఇవ్వడమే కాకుండా పాఠశాల ఆవరణలో ఆర్వో ప్లాంట్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఈ సారి బడ్జెట్‌లో విద్యాశాఖకు కేటాయింపులు కూడా భారీగా పెంచామని చెప్పారు. పిల్లలు చక్కగా చదువుకుని అత్యుత్తమ మార్కులు సాధించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పొట్లూరి సాయిబాబు, అబ్దుల్ కరీమ్, మేదరమెట్ల నారాయణ, బర్రాలు, బాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

7,121 కోట్ల పెట్టుబడులతో 17 పరిశ్రమలు..

అమరావతి, మార్చి 24:కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటన నిమిత్తం సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి మంగళవారం నాడు కుప్పం మండలం, మంకలదొడ్డి గ్రామంలో మహిళలతో నారా భువనేశ్వరి సమావేశమై వారిని ఉద్దేశించి ప్రశంగించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపి, ప్రజలకు సంక్షేమం అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం గా పని చేస్తున్నారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండటం శుభ పరిణామం వారు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. సమాజాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర వహించాలని మహిళల ఆర్థిక ఉన్నతికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు.

కుప్పం నియోజకవర్గ ప్రజలకు మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుందని ఇక్కడి ప్రజలు మమ్మల్ని ఎంతో ఆదరించారని చంద్రబాబు గారిని 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి నా వంతు కృషి చేస్తున్నానని నారా భువనమ్మ తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో చూశాం. రాష్ట్రాన్నిబాగుచేయడం చంద్రబాబు వల్లే అవుతుందనే నమ్మకంతో ప్రజలు గెలిపించారన్నారు .

నిజం గెలవాలి యాత్ర చేపట్టినప్పుడు రాష్ట్ర ప్రజలు , టీడీపీ నేతలు, కార్యకర్తలు నన్ను ముందుండి నడిపించారని,గత ఐదేళ్లలో రాష్ట్రానికి పరిశ్రమలు రాలేదని కూటమి ప్రభుత్వంలో వచ్చాక సీఎం చంద్రబాబు పాలనదక్షతపై నమ్మకంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలి వస్తున్నాయని తెలిపారు.20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజక వర్గానికి రూ. 7,121 కోట్ల విలువైన పెట్టుబడులతో 17 పరిశ్రమలు తీసుకొచ్చారని వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమందికి ఉపాధి లభిస్తుందన్నారు .

ఇప్పటికే నియోజకవర్గంలో రూ. 2,203 కోట్ల పెట్టుబడులతో 7 పరిశ్రమలు స్థాపించారని వీటి ద్వారా 7093 మందికి ప్రత్యక్షంగా, 15,237 మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆమె పేర్కొన్నారు.కుప్పంలో అడిదాస్ కంపెనీ ఫుట్ వేర్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తోందని మహిళలు స్వయం సమృద్ధి సాధించడం కోసం చంద్రబాబు ఎలీప్ సంస్థను కుప్పానికి తీసుకొచ్చారని ఇందు లో శిక్షణ తీసుకున్న మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

కుప్పానికి హంద్రినీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకొచ్చారని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టారు. చెత్త నుంచి సంపద సృష్టికి చర్యలు తీసుకుంటున్నారని ఆమె తెలిపారు.

పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలి

అమరావతి, మార్చి 24: సౌరశక్తి వినియోగంపై ప్రజలల్లో అవగాహన పెంపొందిస్తూ ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు నింపేందుకు పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహనకు సూర్యాంధ్ర ప్రగతి రథాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని విజయవాడ తూర్పు నియోజక వర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు.

నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈఎఫ్ఐ), నెడ్ క్యాప్ సంయుక్త ఆధ్వర్యంలో సూర్యాంధ్ర ప్రగతి రథాలను విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మంగళవారం అశోక్ నగర్ లోని తన క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా శాసనసభ్యులు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేకమైన కార్యక్రమం 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' అని, ప్రతి ఇంటి పైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే అతి తక్కువ ఖర్చుతో మనం ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉందన్నారు.

మనకు అయ్యే ఖర్చు సుమారు 4 నుండి 6 ఏళ్లలో కరెంట్ బిల్లుల ఆదా ద్వారా తిరిగి వచ్చేస్తుందన్నారు. అనంతరం 20 ఏళ్ల పాటు మనం ఉచితంగా విద్యుత్ పొందే అవకాశం ఉంటుందన్నారు.

ఈ రోజున ఏ ఇంటికి వెళ్లినా కరెంట్ బిల్లు ప్రధానమైన భారంగా మారుతోందన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు విద్యుత్ కొనుగోలుకు వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయన్నారు. ప్రకృతి నుంచి, సూర్యుడి నుంచి శక్తిని గ్రహించి సోలార్ ప్లేట్ల ద్వారా ఎనర్జీని ఇచ్చే గొప్ప కార్యక్రమం ఇది అని అన్నారు. దీనివల్ల కాలుష్యం కూడా ఉండదన్నారు. విద్యుత్ ప్లాంట్ల వల్ల బొగ్గు పొగ వల్ల వచ్చే కాలుష్యం మన ఊపిరితిత్తులపై ఎంత ప్రభావం చూపుతుందో మనం ఆలోచించుకోవాలన్నారు.

ఈ పథకంలో క్రింద ప్రభుత్వం పలు సబ్సిడీలను అందిస్తోందన్నారు. రూ.70 వేల నుండి రూ.80 వేల వరకు ఖర్చయ్యే ప్లాంట్‌పై రూ.30,000 సబ్సిడీ ఉంటుందన్నారు.

షెడ్యూల్ కులాలు తెగల వర్గాలకు నూరు శాతం సబ్సిడీ ఇస్తున్నారన్నారు. వారికి ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉందన్నారు. బీసీలతో పాటు అందరికీ ఇందులో సబ్సిడీలు వర్తిస్తాయన్నారు.

తన వ్యక్తిగత అనుభవానికి వస్తే తనకు గతంలో నెలకు వేల రూపాయల విద్యుత్ బిల్లు చెల్లించేవాడినని, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నాక ఇప్పుడు రూ.4,000 నుండి రూ.5,000 వరకు బిల్లు తగ్గిందన్నారు. ఇందుకు సుమారు రూ.6 లక్షలు వరకు ఖర్చు చేశానన్నారు. దీనివల్ల నెలకు రూ.18,000 చొప్పున ఏడాదికి లక్షకు పైగా ఆదా అవుతోందన్నారు.

ఇలా మూడు నుండి నాలుగు సంవత్సరాలలో నేను పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చేస్తుందన్నారు.

తాను వ్యక్తిగతంగా లబ్ధి పొందాను కాబట్టి, ఒక శాసనసభ్యునిగా, ప్రజా ప్రతినిధిగా అందరూ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని లబ్ధి పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ఎన్ఎస్ఈఎఫ్ఐ సీఈవో సుబ్రహ్మణ్యం పులిపాక మాట్లాడుతూ సూర్యాంధ్ర ప్రచార ప్రగతి రథాల ద్వారా పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ వివరాలను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి సీహెచ్ ఉదయ్, నెడ్ కాప్ డెవలప్మెంట్ ఆఫీసర్ మౌలాలి పాల్గొన్నారు.

మూడు కొత్త కార్యక్రమాలను ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్..

న్యూఢిల్లీ, మార్చి 24: భారత మీడియా, ప్రసార, డిజిటల్ రంగాన్ని బలోపేతం చేయడంతోపాటు సృజనాధార ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడం లక్ష్యంగా మూడు ప్రధాన కార్యక్రమాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఈ రోజు ప్రారంభించారు. ఆ మూడు కార్యక్రమాలు:- భారత సృజనాత్మక సాంకేతికతల సంస్థ (ఐఐసీటీ) ద్వారా గూగుల్, యూట్యూబ్ భాగస్వామ్యంతో జాతీయ ఏఐ నైపుణ్యాభివృద్ధి, వేవ్స్ ఓటీటీలో పౌర సృజనకారుల వేదికగా మైవేవ్స్, అలాగే డీడీ ఉచిత డిష్ సేవలను మరింత మెరుగ్గా అందుబాటులోకి తెచ్చేందుకు టీవీ సెట్లలో అడ్వాన్స్డ్ ఎలక్ట్రానిక్ ప్రోగ్రామ్ గైడ్ (ఈపీజీ) - ఇన్‌బిల్ట్ శాటిలైట్ ట్యూనర్లను అమర్చడం. 'సృజనాధార ఆర్థిక వ్యవస్థ'ను ప్రోత్సహించడం, ప్రభుత్వ ప్రసార వ్యవస్థను బలోపేతం చేయడం, మీడియా - వినోద రంగంలో ఏఐ నిపుణుల భాగస్వామ్యాన్ని పెంచడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యం. మీడియా - వినోద రంగం నుంచి ముఖ్య ప్రతినిధులు, యూట్యూబ్ ఇండియా అధినేత, మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో సాంకేతికత:

సాంకేతికతను అందరికీ సమానంగా అందుబాటులోకి తేవాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆకాంక్షను ప్రస్తావిస్తూ.. ఈ కొత్త కార్యక్రమాలు సాంకేతికతను మరింత అందుబాటు ధరల్లో, సులభంగా ప్రజలకు అందుబాటులోకి తెస్తాయని శ్రీ అశ్విని వైష్ణవ్ అన్నారు. టీవీల్లోనే శాటిలైట్ ట్యూనర్లను అమర్చడం, అడ్వాన్స్డ్ ప్రోగ్రామ్ గైడ్ ద్వారా.. అదనపు పరికరాలేవీ లేకుండానే ప్రజలకు సులభంగా కంటెంటు అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు.

రెండో కార్యక్రమం గురించి మాట్లాడుతూ.. కంటెంట్ సృజనకారులకు 'మైవేవ్స్' ఒక శక్తిమంతమైన వేదిక అని, వారు కంటెంటు సృజించి అప్‌లోడ్ చేయడానికీ, షేర్ చేయడానికీ వీలు కల్పిస్తూ.. దేశ డిజిటల్ వ్యవస్థను ఇది బలోపేతం చేస్తుందనీ ఆయన వివరించారు. కేంద్ర బడ్జెట్ ప్రకటనలను ప్రస్తావిస్తూ, సృజనాధార ఆర్థిక వ్యవస్థ (ఆరెంజ్ ఎకానమీ)ను ముందుకు తీసుకెళ్లేందుకు, సృజన రంగానికి చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

యూట్యూబ్ సహకారంతో అమలు చేస్తున్న జాతీయ ఏఐ నైపుణ్య శిక్షణ కార్యక్రమం కింద, దాదాపు 15,000 మంది యువతకు ఎలాంటి రుసుమూ లేకుండా శిక్షణ ఇవ్వనున్నట్టు మంత్రి తెలిపారు.

క్రియేటర్స్ కార్నర్ కార్యక్రమం గురించి కూడా ఆయన మాట్లాడారు. ఇది బాగా ప్రాచుర్యం పొందుతోందని, కొన్ని కంటెంట్లకు ఇప్పటికే 3 మిలియన్లకు పైగా వ్యూస్ వచ్చాయని పేర్కొన్నారు. మన దేశ సుసంపన్నమైన సంస్కృతీ సంప్రదాయాలనూ, ప్రాంతీయ వైవిధ్యాన్నీ ప్రపంచానికి చాటేలా దూరదర్శన్, మైవేవ్స్ వంటి వేదికలను విరివిగా ఉపయోగించుకోవాలని దేశవ్యాప్తంగా ఉన్న సృజనకారులను ఆయన కోరారు.

ఈ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సృజనకారులకు పిలుపునిస్తూ.. తమతమ ప్రాంతాల కథలను ప్రదర్శించి, మీడియా రంగాన్ని ప్రభావవంతంగా, నమ్మకంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు.

సృజనకారుల సాధికారత, విస్తృతంగా ప్రజల్లోకి...

ఈ రోజు ప్రారంభించిన మూడు కార్యక్రమాల గురించి మాట్లాడుతూ.. ఇవన్నీ ఒకే రకమైన విధానపరమైన దిశను ప్రతిబింబిస్తాయని శ్రీ సంజయ్ జాజు స్పష్టం చేశారు. నాణ్యమైన ప్రసారాలను అందరికీ విస్తృతంగా అందుబాటులో తెస్తూ, సృజనకారుల కోసం ఒక బలమైన వ్యవస్థను నిర్మించడం ఈ కార్యక్రమాల ముఖ్య లక్ష్యమన్నారు.

సృజనకారులు తమ సామర్థ్యాలను పెంచుకోవడానికి, మారుతున్న డిజిటల్ ప్రపంచంలో తమ లక్ష్యాలను చేరుకోవడానికి జాతీయ ఏఐ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం సహాయపడుతుందన్నారు. ఒక శక్తిమంతమైన డిజిటల్ వ్యవస్థను నిర్మిస్తూ, పౌరులు కంటెంటును సృజించడానికి, అప్‌లోడ్ చేయడానికి, షేర్ చేయడానికి 'మైవేవ్స్' తోడ్పడుతుందని చెప్పారు. ఇక డీడీ ఉచిత డిష్ ప్రసారాలకు సంబంధించిన మూడో కార్యక్రమం.. సెట్‌టాప్ బాక్స్ అవసరం లేకుండానే ప్రజలు ప్రసారాలను వీక్షించే అవకాశాన్నిస్తూ, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో సమాచార వ్యాప్తిని మెరుగుపరుస్తుందని ఆయన తెలిపారు.

మొత్తంగా, మొదటి కార్యక్రమం ప్రజలను సమర్థులను చేస్తుంది. రెండో కార్యక్రమం అవకాశాల విస్తరణకు దోహదపడుతుంది. మూడో కార్యక్రమం కంటెంటును అందరికీ అందుబాటులోకి తెస్తుంది.

ఏఐ ద్వారా సృజనకారుల సాధికారత

సృజనకారులపై ఈ భాగస్వామ్యం చూపే ప్రభావంపై యూట్యూబ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ గుంజన్ సోనీ మాట్లాడుతూ.. "ఉత్తేజభరితమైన భారత సృజనాధార ఆర్థిక వ్యవస్థలో కృత్రిమ మేధ ద్వారా అసాధారణమైన అవకాశాలను సృష్టించవచ్చని మేం నమ్ముతున్నాం. సమాచార - ప్రసార మంత్రిత్వ శాఖ, ఐఐసీటీతో సహకారం ద్వారా.. భవిష్యత్తులో కీలకం కాబోతున్న సాంకేతిక సాధనాలపై పట్టు సాధించేలా, ఏఐని వినియోగించి మరింత ఆసక్తికరమైన కథనాలను ఆవిష్కరించేలా, కొత్త ప్రేక్షకులకు వారు చేరువయ్యేలా, మీడియా భవితను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించేలా సృజనకారులనూ, నిపుణులనూ సన్నద్ధులను చేయడం మా ముఖ్య లక్ష్యం. సాంకేతికత అందరికీ ఒక సాధనంగా ఉపయోగపడే 'డిజిటల్ ఇండియా'పట్ల మాకున్న ఎనలేని నిబద్ధతకు ఈ కార్యక్రమం నిదర్శనం" అన్నారు.

జాతీయ ఏఐ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం

గూగుల్, యూట్యూబ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుని.. సృజన, మీడియా రంగాలకు చెందిన 15,000 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం కోసం 'జాతీయ ఏఐ నైపుణ్యాభివృద్ధి' కార్యక్రమాన్ని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రకటించింది. భారత సృజనాత్మక సాంకేతికతల సంస్థ (ఐఐసీటీ) ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీసీజీ), మీడియా టెక్నాలజీ వంటి రంగాల్లో ఏఐ సామర్థ్యాలను బలోపేతం చేయడం దీని ముఖ్య లక్ష్యం.

ఈ ఏఐ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని రెండు దశల్లో నిర్వహిస్తారు. 2026 మార్చి 23 నుంచి జూన్ 30 వరకు మొదటి దశ కొనసాగుతుంది. ఇందులో గూగుల్ కెరీర్ సర్టిఫికేట్లు, గూగుల్ క్లౌడ్ జనరేటివ్ ఏఐ లెర్నింగ్ విధానాల ద్వారా.. ఏఐలో పునాది నైపుణ్యాలను నేర్పించడంపై ప్రధానంగా దృష్టి సారిస్తారు. అభ్యర్థులు ఏఐ ఎసెన్షియల్స్, ప్రాంప్టింగ్ ఎసెన్షియల్స్, జనరేటివ్ ఏఐ పరిచయం, జనరేటివ్ ఏఐ లీడర్ పాత్ వంటి కోర్సులను అభ్యసిస్తారు. తర్వాతి దశకు వెళ్లాలంటే ఈ మొదటి దశను విజయవంతంగా పూర్తి చేయడం తప్పనిసరి.

2026 జూలై నుంచి డిసెంబరు వరకు రెండవ దశ ఉంటుంది. సృజనాత్మక రంగంలో అత్యాధునిక, ప్రత్యక్ష శిక్షణతో పాటు ప్రత్యేకంగా ప్రాజెక్టు ఆధారిత శిక్షణపైనా ఇందులో దృష్టి సారిస్తారు. కథన కళ, యూట్యూబ్ సంబంధిత ఉత్తమ విధానాలు, జెమినీ 3, నానో బనానా, వియో, వెర్టెక్స్ ఏఐ వంటి ఏఐ టూల్స్‌ను ఉపయోగించి ఇచ్చే అధునాతన శిక్షణ అంశాలు ఈ పాఠ్యప్రణాళికలో ఉంటాయి. దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో ఈ శిక్షణ ఉంటుంది.భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో సృజనకారులు, మీడియా నిపుణులు, విద్యార్థులు, డెవలపర్లకు ఈ కార్యక్రమం తోడ్పడుతుంది. అలాగే డిజిటల్ కంటెంట్, ఆవిష్కరణల్లో అంతర్జాతీయ కేంద్రంగా భారత్ ఎదిగేందుకు కూడా ఇది దోహదపడుతుంది.

మైవేవ్స్ వేదికను కూడా మంత్రిత్వ శాఖ ప్రకటించింది. వేవ్స్ ఓటీటీలో ఇదొక కొత్త ఫీచర్. ప్రజలు కంటెంటును సృష్టించి ఇందులో అప్‌లోడ్ చేయొచ్చు. షేర్ కూడా చేసుకోవచ్చు. వినియోగదారులు రూపొందించే కంటెంట్ కోసం ఒక క్రమబద్ధమైన వేదికగా మైవేవ్స్‌ను రూపొందించారు. క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ వంటి జాతీయ స్థాయి కార్యక్రమాల్లోనూ పాల్గొనేలా ప్రోత్సహిస్తుంది.

కంటెంటును వీక్షించడం మాత్రమే కాకుండా క్రియాశీలంగా అందులో భాగస్వాములయ్యే దిశగా మార్పును ఈ వేదిక సూచిస్తుంది. తద్వారా వేవ్స్ ఓటీటీ కేవలం వీక్షణకే కాకుండా, కంటెంట్ సృజనకు కూడా వేదికవుతుంది. లఘు చిత్రాలు, వర్టికల్ వీడియోలు, ఎపిసోడ్లుగా ఉన్న కంటెంట్ వంటి వివిధ రూపాల్లో మైవేవ్స్‌లో కంటెంటు ఉంటుంది. అంతేకాకుండా భారతీయ భాషల్లో బహుభాషా వినిమయ వేదిక కూడా (ఇంటర్‌ఫేస్) ఇందులో ఉంటుంది. దేశవ్యాప్తంగా వర్ధమాన సృజనకారులకూ, కథకులకూ ఒక ముఖ్య వేదికగా మైవేవ్స్ నిలుస్తుందని భావిస్తున్నారు.

అడ్వాన్స్డ్ ఈపీజీ, టెలివిజన్ సెట్లలో ఇన్‌బిల్ట్ శాటిలైట్ ట్యూనర్

టీవీ వీక్షణను మరింత సులభతరం చేయడంతోపాటు అందరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా.. టీవీల్లోనే అమర్చిన శాటిలైట్ ట్యూనర్లనూ, వినియోగదారులకు సులభంగా అర్థమయ్యే కొత్త ప్రోగ్రామ్ గైడ్‌ను సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టింది. దీంతో ప్రేక్షకులు ఇకపై విడిగా సెట్‌టాప్ బాక్స్ అవసరం లేకుండానే నేరుగా తమ టీవీల్లో డీడీ ఉచిత డిష్ ఛానెళ్లను నేరుగా చూడొచ్చు. దీనివల్ల అదనపు ఖర్చులు, వైరింగ్, ఎక్కువ సంఖ్యలో రిమోట్లు వాడాల్సిన అవసరం తప్పుతాయి. అలాగే కొత్త అడ్వాన్స్డ్ ప్రోగ్రామ్ గైడ్ ద్వారా వినియోగదారులు ఒకే చోట ఛానెళ్లను, కార్యక్రమ షెడ్యూళ్లను సులభంగా చూసుకోవచ్చు. సరళంగా, అర్థమయ్యేలా ఈ ఇంటర్‌ఫేస్ ఉంటుంది. ఇది దేశవ్యాప్తంగా ఉన్న కుటుంబాలకు టీవీ వీక్షణ అనుభవాన్ని మరింత సౌకర్యవంతంగా మారుస్తుంది.

సృజనాధార ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడం, ప్రజలకు మరింత సులభంగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ప్రసార వ్యవస్థను బలోపేతం చేయడం, మీడియా - వినోద రంగం కోసం భవిష్యత్ సన్నద్ధంగా ఏఐ నైపుణ్యం కలిగిన సిబ్బందిని తీర్చిదిద్దడం వంటి లక్ష్యాలతో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ చర్యలను ముందుకు తీసుకెళ్తోంది. ప్రభుత్వ ప్రసార వ్యవస్థను మెరుగుపరచడంలో ప్రసార భారతి కీలక పాత్ర పోషిస్తుండగా.. సృజన రంగంలో ఏఐ శిక్షణా కార్యక్రమాన్ని ఐఐసీటీ నిర్వహిస్తుంది. అలాగే, పౌరులు భాగస్వాములై కంటెంటును సృష్టించేలా ప్రోత్సహించడంతో పాటు.. క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ వంటి కార్యక్రమాలతో వారిని అనుసంధానించేలా వేవ్స్ ఓటీటీ ఓ వేదికను అందిస్తుంది.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

-అదనపు కలెక్టర్ చంద్రయ్య

ఆదిలాబాద్, మార్చి 24:పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పీ చంద్రయ్య

అధికారులను ఆదేశించారు. ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను మంగళవారం డీఎల్పీవో సతీష్ కుమార్, స్థానిక అధికారు లు, నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలి ంచారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించి శుభ్రత పనుల నిర్వహణ తీరుపై స్థానిక ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాలనీలలో పర్యటిస్తూ పారిశుధ్య పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, నర్సరీ పరిశీలించారు. గ్రామంలోని ప్రతి సైడ్ డ్రెయిన్ శుభ్రంగా ఉండాలని అవసరం అయితే కూలీలను పెంచుకోవాలన్నారు.

ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ లను ప్రతి పదిరోజులకు ఒక సారి శుభ్రపరచాలని, వైపులైన్ లీకేజీలు లేకుండా చూడాలని, వీధి దీపాలు పగలు వెలగకుండా చూడాలని, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో ఇండ్లు నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలని, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కోరత లేకుండా చూడాలని అధికారు లను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీవో అనిల్ కుమార్, సర్పంచ్ ముడిమడుగుల సురేష్, పీఆర్ ఏఈ సాయిలత, వ్యవసాయ అధికారిని సుష్మా, కార్యదర్శి దివాకర్, ఉపసర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, నాయకులు ఎండీ ఈసా, ఆర్ ఐ ఎజాజోద్దీన్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, ఉన్నారు.

ఉత్తమ రోయింగ్ కేంద్రంగా కృష్ణానది..

విజయవాడ, మార్చి 24: కృష్ణా నదిని దేశంలోనే ఉత్తమ రోయింగ్ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చర్యలు ప్రారంభమైనట్లు కాకాని తరుణ్ వెల్లడించారు. రాష్ట్రాన్ని రోయింగ్ క్రీడలో జాతీయ స్థాయిలో ముందంజలో నిలిపేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇస్మాయిల్ బైగ్ మద్దతు కోరినట్లు ఆయన చెప్పారు. రాష్ట్రంలో నైపుణ్యమైన రోయింగ్ కోచ్‌ల కొరత ఉన్నదని, దీనివల్ల ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎదగడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

విజయవాడలో కోచ్‌ల నియామకంపై ఇప్పటికే స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఆంధ్ర ప్రదేశ్ ను అభ్యర్థించినట్లు తెలిపారు. సరైన ప్రణాళిక, సదుపాయాలతో ముందుకు వెళితే ఆంధ్రప్రదేశ్‌ను రోయింగ్ హబ్‌గా తీర్చిదిద్దవచ్చని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ బైగ్ మాట్లాడుతూ, తాను ఆరు సార్లు ఒలింపిక్స్‌కు కోచ్‌గా సేవలందించిన అనుభవం కలిగినవాడినని, ద్రోణాచార్య అవార్డు గ్రహీతనని తెలిపారు.

కృష్ణా నది రోయింగ్ క్రీడకు అత్యంత అనుకూలమని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసే సామర్థ్యం ఈ ప్రాంతానికి ఉందన్నారు. తరువాత డా. కాకాని, ఇస్మాయిల్ బేగ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కోచ్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పాలన

-మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

-కనిమెర్లతండాలో హెల్త్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన.

-పోరాట నగర్లో పశువుల హాస్టల్ ప్రారంభం.

అమరావతి, మార్చి 24:ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వ పాలన ఉందని, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. మైలవరం మండలంలోని కనిమెర్లతండాలో రూ.36లక్షల 15వ ఆర్థికసంఘం నిధులతో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనం (హెల్త్ సెంటర్) నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మంగళవారం శంకుస్థాపన చేశారు.

పోరాట నగర్లో రూ.10 లక్షల ఎన్.ఆర్.ఈ.జి.ఎన్ నిధులతో నిర్మించిన పశువుల వసతి శాలను (పశువుల హాస్టల్) కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ పల్లెల్లో ఆరోగ్య కేంద్రాల నిర్మాణంతో వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజారోగ్య సంరక్షణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మైలవరం నియోజకవర్గంలో రూ.9.35 కోట్లతో 29 హెల్త్ సెంటర్ల నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో భవనం పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎం చంద్రబాబు పశువుల హాస్టళ్లకు బీజం వేశారన్నారు. మూగజీవుల కోసం మేత, తాగునీరు, షెడ్లు వంటి ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సన్న, చిన్నకారు, పశు పోషకుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ పశుపోషకుల సంక్షేమం కోసం కూడా కృషి చేస్తోందని అభినందించారు.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పాలఉత్పత్తి లేదన్నారు. పాలు నిత్యావసర వస్తువుగా మారిందన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధి చెందితేనే అందరికీ నాణ్యతతో కూడిన పాలు లభిస్తాయన్నారు. ఇందు కోసం పశుసంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం పలు రాయితీలను కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం, యూనియన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని పాడి పశువులను వృద్ధి చేసుకుని నాణ్యమైన పాల దిగుబడి సాధించాలన్నారు.

తద్వారా జీవనోపాధి పొందాలని సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణ రిక్షాను ప్రారంభించారు. వెదురుబీడెం గ్రామంలో టీడీపీ కుటుంబ సభ్యుడు కొలుసు రంగారావు ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గారికి ఆయా గ్రామాల్లో ఘనస్వాగతం లభించింది. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

చట్టవిరుద్ధంగా మత్స్యకారుల చేపల వేట

న్యూఢిల్లీ, మార్చి 24:స ముద్రంలో పన్నెండు నాటికల్ మైళ్ల వరకు ఉండే ప్రాదేశిక జలాల్లో చేపలు పట్టే అంశం రాష్ట్ర జాబితాలోని 21వ ఎంట్రీ పరిధి లోకి వస్తుందనీ, దీనికి సంబం ధించిన కార్యకలాపాలను క్రమబ ద్ధీకరించే బాధ్యత కోస్తాతీర రాష్ట్ర ప్రభుత్వాలదీ, కేంద్ర పాలిత ప్రాంతాల (యూటీస్)దీ. 12 నాటికల్ మైళ్ల ఆవలి భారతదేశ ప్రత్యేక ఆర్థిక మండలం (ఈఈజ డ్)లో చేపలు పట్టే అంశం కేంద్ర జాబితాలో 57వ ఎంట్రీలో భాగం కావడం వల్ల తత్సంబంధిత కార్యకలాపాలను కేంద్ర ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుంది. దీనికి అనుగుణంగానే కోస్తా తీర రాష్ట్రాలు, యూటీలు ప్రాదేశిక జలాల్లో చేపలు పట్టడాన్ని క్రమబద్ధీకరించడానికి తమ తమ మరీన్ ఫిషింగ్ రెగ్యులేషన్ యాక్టుల (ఎమ్ఎఫ్ఆర్ఏస్)ను అమలు చేస్తుంటాయి. చేపలు పట్టేందుకు యంత్రాల సహాయం లేకుండానూ (నాన్?మోటరైజ్డ్), యంత్రాధారితంగానూ (మోటరై జ్డ్) పని చేసే పడవలను ఉ పయోగిస్తున్న సాంప్రదాయిక మత్స్యకారులకు ప్రత్యేకంగా కొన్ని మండలాలను (జోన్స్) కూడా అనేక రాష్ట్రాలు, యూటీలు నిర్ధా రించాయి. ఆ జోన్లలో యంత్రా ధారిత ఓడలు ప్రవేశించకుండా నిషేధం విధించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన ప్రాదేశిక జలాల్లోనూ, పులికాట్ సరస్సు ప్రాంతంలోనూ తమిళనాడు, పుదుచ్చేరిల నుంచి వస్తున్న పడవలు చట్టవిరుద్ధంగా చేపల వేటకు దిగుతున్న ఘటనలు అప్పుడప్పుడూ చోటుచేసు కుంటున్నాయని తెలిపింది. ఇలాంటి అంతర్ రాష్ట్ర చేపల వేట సంబంధిత అంశాలను పరిష్కరిం చడానికీ, అంతర్ రాష్ట్ర మండలి సలహా మేరకు, కేంద్ర ప్రభుత్వ మత్స్య విభాగం 2023 మార్చి నెల 29 నాటి ఉత్తర్వు ద్వారా.. మూడు ప్రాంతీయ మత్స్య నిర్వహణ మండళ్లను (ఆర్ఎఫ్ ఎంసీస్) ఏర్పాటు చేసింది. వీటిలో పశ్చిమ, తూర్పు, దక్షిణ ఆర్ఎఫ్ ఎంసీలు ఉన్నాయి. ఈ ఆర్ఎఫ్ ఎంసీలు రాష్ట్రాలు, యూటీలకు అంతర్ రాష్ట్రీయ మత్స్య పాలన సంబంధిత వివాదాలను సహకార పూర్వకంగా పరిష్కరించడంతో పాటు సముద్ర వనరుల సమాన ప్రాప్తిని నిర్ధారిం చడానికి ఒక వేదిక లాగా పని చేస్తున్నాయి. భారత తీరరక్షక దళానికి ఈ మూడు ఆర్ఎఫ్ ఎంసీలలోనూ ప్రాతినిధ్యం కల్పించారు. రాష్ట్రా లు, యూటీలు ప్రస్తావించే అంశాలను సంబంధి , త ఆర్ఎఫ్ఎంసీ చర్చాంశాల జాబితాలో చేరుస్తారు.

ఇలాంటి ఘటనలు మళ్లీ మళ్లీ జరగకుండా ఆపడానికీ, చేపల వేట కార్యకలాపాలు శాంతి యుతంగా, నిరంతరాయంగా కొనసాగడానికీ పొరుగు కోస్తాతీర రాష్ట్రాలూ, యూటీలతో కలిసి ప్రస్తుత సంస్థాగత యం త్రాంగా లతో సమన్వయపూరిత కార్యాచర ణను చేపడుతున్నట్లు తమిళనాడు ప్రభుత్వం తెలియజేసింది. మత్స్య కారుల భద్రతనీ, జీవనోపాధినీ దృష్టిలో పెట్టుకొని సంస్థాగత యంత్రాంగాల్ని పటిష్ఠపరచడానికి క్రియాత్మక చర్యలను తీసుకుం టున్నట్లు కూడా తమిళనాడు పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్ 2023 ఆగస్టు 19 నాటి ఆర్ఎఫ్ఎంసీ సమా వేశంలో ప్రస్తావించిన ఆందోళ నలను లెక్కలోకి తీసుకొని తమిళనాడు ప్రభుత్వం 2024 జనవరి 31న ఒక ఉత్తర్వును జారీ చేసింది. అందులో జిల్లా స్థాయి సంఘాన్ని నియమించినట్లు తెలిపింది. ఈ సంఘంలో తమిళనాడు లోని తిరువల్లూర్, చెన్నై, చెంగల్పట్టు లతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌పీఎస్ఆర్ నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల కలెక్టర్లకూ, అధికారులకూ స్థానం కల్పించారు. మత్స్యకా రులకు అవగాహన కలిగించ డంతో పాటు రెండు రాష్ట్రాల మధ్య చేపల వేటకు సంబంధి ంచిన వివాదాలను పరిష్కరించే బాధ్యతను ఈ సంఘానికి అప్పజెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న సాక్ష్యాల (వీటిలో ఫోటోలు, వీడియోలు కూడా ఉన్నాయి) ఆధారంగా.. 'నియమాలను ఉల్లంఘించి చేపల వేటకు దిగిన పడవల'పై తమిళనాడు మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ యాక్టు-1983లో పేర్కొన్న ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తమిళనాడు ప్రభుత్వం తెలిపింది.

ఇదే విధంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పుదుచ్చేరి నుంచి వచ్చే పడవలు అక్రమ చేపల వేటకు పాల్పడ్డ ఘటనలపై తగిన చర్యలను చేపట్టాల్సిందిగా కూడా పుదుచ్చేరి పాలన యంత్రాంగానికి నివేదిస్తోంది. ఆంధ్రప్రదేశ్ తన ప్రాదేశిక జలాల్లో చట్టవిరుద్ధంగా, సమాచారమివ్వకుండానే, నియం త్రణకు లోబడని విధంగా (ఐయూ యూ) చేపల వేటకు దిగుతున్న సమస్యని ప్రభావవంతంగా పరిష్కరించడానికి మరింత కఠిన నిబంధనలను చేర్చే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య పాలన క్రమబద్ధీకరణ చట్టం-1994లో సవరణలు చేసేందుకూ నడుం కట్టింది.

ఈ సమాచారాన్ని లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు సమాధా నంగా మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ తెలియజేశారు.

గంగారం అభయాంజనేయ స్వామి ఆలయంలో బోరుబావి ప్రారంభం

నల్గొండ, మార్చి 24:నె న్నెల మండలంలోని గంగారం గ్రామ అభయాంజనేయ స్వామి దేవాలయంలో భక్తుల సౌకర్యా ర్థం ఏర్పాటు చేసిన నూతన బోరుబావిని మంగళవారం గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్ ప్రారంభించారు. ఎండకాలం దృష్ట్యా ఆలయానికి వచ్చే భక్తులు, ప్రజల తాగునీటి ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్, తన సొంత నిధులతో ఈ బోరుబావిని మంజూరు చేశారు. ఈ సందర్భ ంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల క్షేమం కోరే ఎమ్మెల్యే గడ్డం వినోద్ సేవా దృక్పథం అభినందనీయమని కొనియాడారు.

బిజ్వార్ లోఉల్లాసంగా కొనసాగుతున్న జిల్లాస్థాయి భజన పోటీలు.

ఆదిలాబాద్, మార్చి 24: నారాయణపేట జిల్లాఊట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ లో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి భజన పోటీలు ఉ ల్లాసంగా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మూడో రోజుభజన పోటీలుపోటా పోటీగా నిర్వహించారు. నిర్వాహకులు సుధాకర్ రెడ్డి, దోరోళ్ల కృష్ణయ్య, దాసరి రామాంజనేయులు నేతృత్వంలో పోటీలు వేడుకగా చేపడుతున్నారు. నర్వ, లంకాల, ధన్వాడ రెండు టీంలు, పల్లెగడ్డ, చిన్నపోర్ల రెండు టీంలు, జంగం రెడ్డిపల్లి, గున్ముక్ల, పులిమామిడి, పూసల్ పాహాడ్, జక్కన్న పల్లి, ఎడవెల్లి, నిడుగుర్తి, ధన్వాడ, అవుసలోని పల్లి, భజన టీం సభ్యులు పోటీ పడుతున్నారు.

ఆసక్తి కల భజన టీంలు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా పేర్లు నమోదు చేసుకొని ఈ నెల 26 వరకు జరిగే జిల్లా స్థాయి భజన పోటీల్లో పాల్గొనాలని కోరారు.గెలుపొందిన భజన టీంలకు శ్రీరామ నవమి రోజు మొదటి, రెండవ, మూడవ, నాలుగవ, ఐదవ నగదు బహుమతులు అందచేయడం జరుగుతుందని అన్నారు. భజన పోటీలు రోజు సాయంత్రం 7:30 గంటలకు శ్రీ సీతారామాంజనేయ దేవాలయంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్యాట శ్రీనివాస్,నాగేష్ గౌడ్, నేడుగం రాఘవేంద్ర, హెచ్. నర్సింహా, రాజప్ప,పోలీస్ హన్మి రెడ్డి,ఆంజనేయులు గౌడ్,వెంకటప్ప, మహేష్ గౌడ్, అశోక్, మారుతి, శ్రీనివాస్, అశోక్ రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేయించాలి.. జిల్లా పశువర్ధక శాఖ అధికారి వేణుగోపాల్ రావు

కరీంనగర్, మార్చి 24: రైతులు తమ పాడి పశువులను గాలికుంటూ వ్యాధి నుంచి రక్షించేందుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా పశు వర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్ రావు సూచించారు. రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామంలో నిర్వహిస్తున్న గాలికుం టూ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన మంగళ వారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు గాలికుంటూ వ్యాధి సోకితే పాలు తగ్గడం, పశు వులు బలహీనపడటం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపా రు. ఈ వ్యాధి నివారణకు ప్రభ ుత్వం ఉచితంగా టీకాలు అంది స్తున్నందున రైతులు ఈ అవకా శాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ప్రతీ గ్రామంలో పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి టీకాలు వేస్తున్నారని తెలిపారు. టీకాల కార్యక్రమంలో పాల్గొన్న గోపాలమిత్ర సభ్యులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రతీ పాడి పశువుకు టీకా వేయబడేలా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులకు టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా పశువులకు వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్య అధికారులకు సమాచారం ఇవ్వాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గోపాలమిత్ర సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వేదికగా న్యాకో సురక్ష సంకల్ప్ కార్యశాల

జిల్లాస్థాయిలో హెచ్ఐవీ నియంత్రణ చర్యలు చేపడుతున్న న్యాకో

హైదరాబాద్, మార్చి 24:జా తీయ హెచ్ఐవీ నియంత్రణ చర్యలలో భాగంగా జిల్లా స్థాయి కార్యాచరణను వేగవంతం చేసేందుకు భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(న్యాకో) రాష్ట్రాలతో మరింత అనుసంధానమై పని చేస్తోంది. ఇందులో భాగంగా 'సురక్ష సంకల్ప్ కార్యశాల' పేరుతో మార్చి 25న హైదరాబాద్‌లో వర్క్‌షాప్ నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి న్యాకో అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాకేష్ గుప్తా అధ్యక్షత వహిస్తారు. ''మిషన్ ఎయిడ్స్ సురక్ష'' అనే విస్తృత కార్యక్రమంలో భాగంగా ఈ కార్యశాల జరుగుతోంది. సురక్ష సంకల్ప్ కార్యశాలల ద్వారా హెచ్ఐవీ ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో కార్యక్ర మ అమలును బలోపేతానికి న్యాకో రాష్ట్రాలతో కలిసి పనిచే స్తోంది.

రాష్ట్ర, జిల్లా స్థాయిలో కార్యక్ర మ నిర్వాహకులను, ప్రధాన భాగస్వాములను ఈ కార్యశాల ఏకతాటిపైకి చేర్చుతుంది. ఇందులో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. సంగీత సత్యనారాయణ, జిల్లా కలెక్టర్లు, అదనపు జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్యారోగ్య అధికారులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారులు పాల్గొంటారు.

తెలంగాణలో హెచ్ఐవీ ప్రాబ ల్యం 0.41 శాతంగా ఉండటం, హెచ్ఐవి/ఎయిడ్స్‌తో జీవిస్తున్న వారి సంఖ్య 1,56,961 ఉన్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టితో కూడిన ఈ విధానం కింద ప్రాధాన్యత కలిగిన రాష్ట్రంగా గుర్తించారు. కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేసేందుకు హైదరాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, కరీంనగర్, నల్గొండ, సిద్దిపేట, మెదక్, వరంగల్, నిజామాబాద్, ఆదిలా బాద్, సూర్యాపేట, పెద్దపల్లి, జనగాం, వికారాబాద్, కామారె డ్డి, హనుమకొండ, నంగారెడ్డి, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి సహా 19 ప్రాధాన్యత జిల్లాలను గుర్తించారు. ఈ జిల్లాల ప్రతినిధులు కార్యశాలలో పాల్గొని తమ జిల్లాల పురోగతిని వివరిస్తారు. కార్యక్రమ అమలులో సవాళ్లపై చర్చిస్తారు. సేవలను మరింత మెరుగ్గా అందజేసేందుకు లక్షిత వ్యూహాలను రూపొందిస్తారు.

హెచ్ఐవీ నివారణతో పాటు, నిర్ధారణకు పరీక్షా సేవలను మరింత మెరుగ్గా అందుబా టులోకి తేవడం, చికిత్సతో అనుసంధానం, చికిత్స కొనసాగే లా చూడటం, హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి మెరుగైన ఆరోగ్య ఫలితాలను అందించడంపై ప్రధాన దృష్టితో ఈ కార్యశాలలో చర్చలు జరుగుతాయి.

జాతీయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయ చర్యలను చేపట్టడం ద్వారా ఈ కార్యశాలలు కార్యక్రమ అమలులో డేటా-ఆధారిత, వికేంద్రీకృత విధానాన్ని బలోపేతం చేస్తున్నాయి. ఈ కార్యక్రమం జాతీయ హెచ్ఐవీ/ ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాల దిశగా పురోగతిని గణనీయంగా వేగవంతం చేస్తుందని, ప్రజారోగ్యానికి ముప్పుగా ఉన్న ఎయిడ్స్‌ను అంతం చేయాలనే భారతదేశ నిబద్ధతకు దోహదపడుతుందని భావిస్తున్నారు.

గ్రామీణాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం..

-నల్లగొండ ఎంపీడీవో యాకూబ్ నాయక్

నల్గొండ, మార్చి 24: గ్రామీణాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని నల్లగొండ ఎంప ీడీవో భూక్య యాకూబ్ నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నూతనం గా ఎన్నిక కాబడిన 16 గ్రామపం

చాయతీ వార్డ్ మెంబ ర్లకు ఏర్పా టుచేసిన రెండో రోజు శిక్షణలో మాట్లాడారు.వార్డ్ మెంబర్లకు పంచాయతీ వ్యవస్థ పలు బాధ్యత లు కట్టబెట్టిం దని వార్డుల్లో సమ స్యలు గుర్తించి పరిష్కరించడంలో చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి వెళ్లేలా చూడాలన్నారు. పంచాయ తీరాజ్ చట్టం, గ్రామసభల నిర్వహణ, ఆర్థిక వివరాలు, అభివృద్ధి పథకాల అమలు, ఆర్థిక వ్యవహా రాలు, రికార్డుల నిర్వహ ణ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్ల ద్వారా అవగాహన కార్యక్ర మం కల్పిస్తామని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల పరిపాలనలో నియమ నిబంధనలను పాటిస్తూ గ్రామాల యొక్క సుస్థిర అభివృద్ధికి పాటుపడాలని తెలియజేశారు. ఈ సమావేశంలో ఎంపీఓ ఇస్మాయిల్ , ట్రైనర్ లు వెంకన్న, రాజశేఖర్, గీతాంజలి, రాజేందర్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యద ర్శులు మహమూద్, ఫారుఖ్, అనిల్, మౌనిక, సంధ్య, జావీద్ తదితరులు పాల్గొన్నారు.



'జనాభా లెక్కలు-2027' సేకరణలో జాగ్రత్త చర్యలు

న్యూఢిల్లీ, మార్చి 24:జనా భా లెక్కలు-2027 నమోదు కార్యక్రమాన్ని డిజిటల్ మాధ్య మం ద్వారా నిర్వహించాలని సంకల్పించి అందుకు అనుగుణం గా రంగాన్ని సిద్ధం చేస్తున్నారు. జనాభా లెక్కల సమాచారాన్ని సేకరించే వారు (ఎన్యూమరేటర్లు) మొబైల్ యాప్‌ని ఉపయోగించి, సమాచారాన్ని సేకరించనున్నారు. దీంతో పాటు, పౌరులే స్వయంగా ఈ జనాభా లెక్కల సేకరణకు తమ వంతుగా సహకరించే ఏర్పా టునూ చేశారు. ఇందుకోసం మొదటి సారి ఒక వెబ్ పోర్టల్ సాయాన్ని తీసుకుంటారు. జన గణన (సెన్సస్)-2027కు సంబంధించిన వివిధ కార్యకలా పాల నిర్వహణకీ, పర్యవేక్షణకీ ఈ వెబ్ పోర్టల్‌ను రూపొందించారు. సెన్సస్-2027 తొలి దశలో ఉ పయోగించే ప్రశ్నల్ని వెల్లడిం చారు. రెండో దశను నిర్వహించే ముందుగా దానికి సంబంధించిన ప్రశ్నలను నోటిఫై చేస్తారు. గృహ స్థితికి సంబంధించిన సమాచా రం, కుటుంబ వివరాలు, అందు బాటులో ఉన్న సదుపాయాలు, కుటుంబానికి ఉన్న ఆస్తుల సమాచారాన్ని జనాభా లెక్కల మొదటి దశలో సేకరించ నున్నారు. వ్యక్తుల వయస్సు, ఆదాయం వగైరా సమాచారం, సామాజిక-ఆర్థిక, విద్యా, ప్రవాస ం వగైరా వివరాల్ని రెండో దశలో సేకరిస్తారు.

జన సంఖ్య ఎంత ఉందీ తెలుసుకొనే కార్యక్రమాన్ని సెన్సస్ చట్టం-1948, సెన్సస్ నియమా వళి-1990తో పాటు వాటిలో చేసిన సవరణలకు సంబంధించిన నిబంధనలను అనుసరించి చేపడుతారు. జన గణన ప్రక్రియలో సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉ ంచుతారు. వివిధ పరిపాలక స్థాయుల్లో సేకరించిన మొత్తం డేటాను మాత్రమే ప్రచురిస్తారు.

వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలూ, కేంద్ర పాలిత ప్రాంతాల పాలన యంత్రాంగాలూ సెన్సస్ చట్టం-1948, సెన్సస్ నియమావ ళి-1990ల నిబంధనల ప్రకారం నియమించే, రంగంలోకి దింపే జనగణన అధికారులు సమాచారాన్ని సేకరించడం, సరిచూడటం, పర్యవేక్షణ, ఈ కార్యక్రమ పురోగతిపై సమీక్ష నిర్వహించడం వంటి వేర్వేరు క్షేత్రస్థాయి కార్యకలాపాలను నిర్వర్తిస్తారు. ఈ కారణంగా ఎలాంటి ఇబ్బందికీ తావివ్వకు ండా జనాభా సంఖ్యను లెక్కించడంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఓ ముఖ్య పాత్రను పోషిస్తాయి.

ఈ సమాచారాన్ని కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ నిత్యానంద్ రాయ్ లోక్‌సభలో ఓ ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలియజేశారు.

పేదలకు ఇళ్ల స్థలాల హామీని నెరవేర్చాలి

అమరావతి, మార్చి 24:రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన హామీలను నెరవేర్చాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్ చేసారు.. సిపిఐ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరుతూ మంగళవారం పట్టణం లో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారా యణరాజు అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు పట్టణంలో పేదలకు 0.02 సెంట్లు, గ్రామీణ ప్రాంతా ల్లో 0.03సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు.

కానీ ఇప్పటి వరకు నెరవేర్చలేదని అన్నా రు.ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా టిడ్కో ఇళ్ళు లబ్దిదార ులకు స్వాధీనం చేయాలని అన్నారు.

బాడుగ ఇంట్లో ఉండే పేదవా రికి ఇంటి అద్దె చెల్లించాలని అన్నారు. జి.ఓ.ఎం.ఎస్ నెం.23 సడలించాలని అన్నారు.

కేసుల దర్యాప్తులో అలసత్వం వహించొద్దు : ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్గొండ, మార్చి 24:పో లీస్ సిబ్బంది ప్రజలకు అందుబా టులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నా రు. మంగళవారం నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలోని తిప్పర్తి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పని తీరు, స్టేషన్ పరిధిలోని పరిస్థితు లు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి సంబంధిత అధికా రులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్ విభాగం, లాక్ అప్, ఎన్.హెచ్.ఓ గది తదితర విభాగాలను ఎస్పీ పరిశీలించి, స్టేషన్ పరిధిలో కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి, కేసుల దర్యాప్తు విష యంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించరాదని సూచించారు. దర్యాప్తులో ఉన్న కేసులను సమగ్రంగా విచారణ చేసి, చట్ట ప్రకారం నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని ఆదేశించారు.

గ్రామ పోలీసు అధికారులు ప్రతిరోజూ తమ పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మమేకమై నేర నియంత్రణకు కృషి చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదు లపై ఎటువంటి జాప్యం చేయకు ండా బాధితుల పట్ల తక్షణ స్పం దన చూపాలని, ప్రజలకు ఎల్ల ప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిం చాల ని సూచించారు. బ్లూ కోల్ట్ మరి యు పెట్రో కార్ విధుల్లో ఉన్న సిబ్బంది డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందిస్తూ సంఘటనా స్థలానికి త్వరితగతిన చేరుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. పెట్రోలింగ్ సమయంలో స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతిరోజూ తనిఖీ చేయాలని, స్టేషన్ పరిధిలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి సారించి, మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని సూ చించారు. సైబర్ క్రైమ్ మరియు డయల్ 100 సేవల వినియో గంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాలని తెలిపారు.

అలాగే అసాంఘిక కార్యకలా పాలు అయిన గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా, జూదం వంటి నేరాలపై కఠిన చర్యలు తీసుకో వాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించాలని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో నల్లగొం డ డిఎస్పీ శివరాం రెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, తిప్పర్తి ఎస్.ఐ శంకర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సాటిలేని మేటి సంపాదకులు చలపతిరావు

మార్చి 25...మానికొండ చలపతిరావు వర్ధంతి

మానికొండ చలపతిరావు (1908 -1983) పత్రికా రచయిత, సంపాదకుడు, గ్రంథకర్త, సాహితీవేత్త, మానవతా వాది. నిర్భయమైన, నిష్పాక్షికమైన శక్తి వంత మైన, పాఠకులను ఎంతగానో ఆకట్టుకునే రచనలకు చలపతి రావు, భారత దేశం లోనే ఇంగ్లీష్ జర్నలి జంలో గొప్ప సంపాదకులుగా మిగిలి పోయారు. భారతదేశ ప్రభుత్వం ప్రెస్ కమిషన్ (Press Commission) ఏర్పాటు చేయడానికి ఆయనే ప్రధాన కారకులు.

మానికొండ చలపతి రావు1908 సంవత్సరంలో విశాఖపట్నంలో జన్మిం చారు. బాల్యం నుండి ఆయన జర్నలిస్టు కావాలని అనుకోలేదు.

అయితే వార్తా పత్రిక లను మొదటి నుండి చివరి వరకు ఆసాంతం ఇష్టంగా చదివే అలవాటు చేసుకున్నారు.

ఎం.ఏ., బి.ఎల్. పట్టాలను పొంది కొంతకాలం న్యాయవాదిగా పని చేశారు. ఆయన విశాఖ పట్నంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన "ఎథేనియం" అనే పేరుతో సాహిత్య సాంస్కృతిక సంస్థను నెలకొల్పి తాను కార్యదర్శిగా పనిచేశారు. తర్వాత "పీపుల్స్ వాయిస్", "వీక్ ఎండ్", "హిందూస్థాన్ టైమ్స్" పత్రికలలో వేర్వేరు కాలాలలో సహాయ సంపాదకులుగా పనిచేశారు.

జవహర్‌లాల్ నెహ్రూ 1938 లో స్థాపించారు. జవహార్ లాల్ నెహ్రూ 1938 లో లక్నో నుండి ప్రారంభించిన "నేషనల్ హెరాల్డ్" దినపత్రికకు చలపతి రావు ను సహాయ సంపాదకునిగా నియమించారు. అయన చిత్తశుద్ధితో, అంకిత భావంతో, రాజీ లేని, ఒత్తిళ్ళకు లొంగని శక్తివంతమైన సంపాదకీయాలు, వ్యాసాలు రాశారు. దేశంలో కొద్దిమంది జర్నలిస్టులు అటువంటి శక్తితో వ్రాయ గలిగారు, అతి తక్కువ మంది ఆయన అనుసరించిన పదబంధాలను, భాషపై పట్టును కలిగి ఉండేవారు. నేషనల్ హెరాల్డ్ మూసి వేయడం ద్వారా ది హిందూస్తాన్ టైమ్స్‌లో అసిస్టెంట్ ఎడిటర్‌గా పని చేయడానికి ముందు స్వాతంత్ర్య పోరాటంలో ప్రెస్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

1946 లో అప్పటి ప్రభుత్వం మూసివేసిన తరువాత తిరిగి తెరిచినప్పుడు ఆయన నేషనల్ హెరాల్డ్ ఆఫ్ లక్నోకు సంపాదకులు అయ్యాడు.

అదే పత్రికకు సంపాదకులుగా 1946 నుండి 1978 వరకు కొనసాగి నెహ్రూకు సన్నిహిత మిత్రుడై భారత దేశం లోని ప్రముఖ పత్రికా సంపాదకులుగా పేరుపొందారు.

శక్తివంతమైన సంపాదకీయాలు మరి యు వ్యాసాలు రాశారు. దేశంలో కొద్ది మంది జర్నలిస్టులు మాత్రమే అటువంటి శక్తితో వ్రాయ గలిగారు, తక్కువ మంది ఆ పదబంధాన్ని కలిగి ఉండేవారు.

యునెస్కో ప్రెస్ నిపుణుల కమిటీలో సభ్యుడిగా పని చేశారు. ఆయన 1955 లో యుఎన్ ఎన్ఆర్, పోలాండ్ మరియు యుగోస్లేవియాలో పర్యటించిన జవహర్ లాల్ నెహ్రూతో కలిసి వచ్చిన ఇండియన్ ప్రెస్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించా రు. 1958 లో, ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో భారత దేశానికి ప్రాతినిధ్యం వహించారు.

చలపతి రావు ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్స్టిట్యూట్ ఇనిషియేటింగ్ కమిటీ సభ్యులు కూడా.

ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (Indian Fedration of Working Journalists)అనే సంస్థను వ్యవస్థీకరించి దానికి మొదటి అధ్యక్షులై, ఆ సంస్థను 1950 నుండి 1955 వరకు ట్రేడ్ యూనియన్ పద్ధతిలో నడిపి దేశంలోని పత్రికా రచయితలకు మెలైన స్థితిగతులను కల్పించ డానికి ఎంతగానో పాటు పడ్డారు.

1952 లో చైనాకు భారత ప్రభుత్వ గుడ్విల్ మిషన్ సభ్యులు.

ఆయన జవహర్ లాల్ నెహ్రూ, గోవింద వల్లభ పంత్ ల జీవిత్ర చరిత్రలను ఆంగ్లంలో రచించారు. ది ప్రెస్ ఇన్ ఇండియా (ప్ప్రవ ఖతీవబబ తిని ఎనిటతిజీ) అనేది ఆయన ప్రసిద్ధిచెందిన గ్రంథం.

ఆయన1983 మార్చి 25 తేదీన పరమ పదించారు.

-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

సకల కళల సమ్మేళనం హరికథ

ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వీసీ ఆచార్య జంపాల వెంకటరమణ

తిరుపతి,మార్చి 24:సంగీతం, నాట్యం, నటన వంటి సకల కళల సమ్మేళనం హరికథ అని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జంపాల వెంకటరమణ పేర్కొన్నారు. విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం 22/03/2026రి హథీరాంజీ కాలనీలోని చాంబర్ ఆఫ్ కామర్స్ లో నిర్వహించిన మూడు తరాల హరికథక ఎలకు ఆత్మీయ సత్కారం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ హరికథలోని సందేశం ద్వారా సమాజం జాగృతం అవుతుందని వివరించారు.అధ్యక్షత వహించిన ప్రముఖ హరికథకులు డాక్టర్ వై. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హరికథ కళారూపాన్ని కాపాడుకోవడానికి భావితరాల వారికి అందించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జీవితానికి మార్గ నిర్దేశం చేసే అనేక అంశాలు హరికథలో ఉన్నాయని చెప్పారు.ఈ సందర్భంగా మూడు తరాలకు చెందిన హరికథకులు కే. వెంకట కృష్ణయ్య, మండూరి లక్ష్మీకుమారి, ఎం రాముడు, టి.ఎం.రమ్యకృష్ణ, హెచ్.వెంకటరమణ,పావనశ్రీ లను సత్కరించి అభినందించారు.

గౌరవ అతిథి సాఫ్ట్ వేర్ ఇంజనీర్ శరత్ బాబు మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ బీవీ కృష్ణమరాజు స్మారకార్థం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి ఏడాది కొంతమంది హరికథకులను సత్కరిస్తామని తెలిపారు. ప్రముఖ రచయిత ఆర్. సి.కృష్ణ స్వామి రాజు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ఎల్. నారాయణ, బి రమణ రాజు, సుదర్శన వర్మ,భూపతి రాజు, సీనియర్ జర్నలిస్ట్ జగదీష్, సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కే. సుబ్రహ్మణ్యం, గాయకుడు నాయని మధు తదితరులు పాల్గొన్నారు

రూ.647.58 కోట్ల విలువైన ప్రాజెక్టులకు పచ్చ జెండా

న్యూఢిల్లీ, మార్చి 24:పశ్చిమ రైల్వేలోనూ, తూర్పు రైల్వేలోనూ రెండు ముఖ్య రైల్వే మౌలిక సదుపాయాల నిర్మాణ పనులకు రైల్వేల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులు అనుసంధానాన్ని పెంచడం, రద్దీని తగ్గించడంతో పాటు నిర్వహణ సామర్థ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయి. ఈ ప్రాజెక్టుల్లో.. గుజరాత్ లోని కోశాంబ-ఉమ్రపాద గేజ్ మార్పిడి సెక్షనుకు అనుసంధాన సదుపాయాన్ని సమకూర్చడానికి ఉద్దేశించిన కోశాంబ రైల్ ఓవర్ రైల్ (ఆర్ఓఆర్) ఫ్లయ్ఓవర్ నిర్మాణంతో పాటు, బీహార్లోని భాగల్పూరులో ఒక కొత్త రైలు ఉపమార్గాన్ని అభివృద్ధిపరచడం భాగంగా ఉన్నాయి.

పశ్చిమ రైల్వేలోని కోశాంబ-ఉమ్రపాద జీసీ సెక్షన్లో రైల్-ఓవర్-రైల్ (9.20 కి.మీ.)కి అనుమతి

కోశాంబ-ఉమ్రపాద గేజ్ మార్పిడి (జీసీ) సెక్షన్లో 9.20 కిలోమీటర్ల పొడవున ఒక రైల్-ఓవర్-రైల్ ఫ్లయ్ఓవరును నిర్మించడానికి భారతీయ రైల్వేలు ఆమోదం తెలిపింది. ఆర్ఓఆర్ నిర్మాణానికి రూ.344.38 కోట్లు ఖర్చు చేస్తారు. ముంబయి-వడోదరా ప్రధాన మార్గానికి తూర్పు దిశలో కోశాంబ-ఉమ్రపాద సెక్షను ఉంది. దీని గేజ్ మార్పిడి పనులను ఇప్పటికే కొంత పూర్తి చేశారు.

సరకు రవాణాకంటూ ప్రత్యేక కారిడార్‌ను ఏర్పరిచినందువల్ల, గేజ్ మార్పిడి చేసిన మార్గాన్ని ప్రధాన మార్గంతో నేరుగా నేల మీద నుంచి దాటి పోయేటట్టు సంధానించే వీలు లేదు. ఆమోదం తెలిపిన రైల్ ఓవర్ రైల్ ఫ్లయ్ ఓవర్ ఈ సమస్యను పరిష్కరించి, జీసీ సెక్షనును ముంబయి-వడోదరా ప్రధాన మార్గంతో నిరాటంకంగా కలవడానికి దోహద పడుతుంది. దీంతో ఈ కీలక దారుల్లో రైళ్లు ఏ అడ్డంకీ లేకుండా సురక్షితంగా సాగిపోయేందుకు అవకాశం లభిస్తుంది. ఫలితంగా గేజ్ మార్పిడి ప్రాజెక్టు ప్రయోజనాలు సంపూర్ణంగా సిద్ధిస్తాయి.

తూర్పు రైల్వే పరిధిలో భాగల్పూర్ బైపాస్ (13.38 కి.మీ.)కి అనుమతి

రూ. 303.20 కోట్లతో తూర్పు రైల్వేలో 13.38 కిలోమీటర్ల పొడవున భాగల్పూర్ ఉపమార్గ నిర్మాణానికి కూడా మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ బైపాస్.. బారాహాట్-భాగల్పూర్ సెక్షన్లోని గోనుధామ్ మజిలీని భాగల్పూర్-సాహిబ్‌గంజ్ సెక్షన్లోని సాబూర్తో కలుపుతుంది. ఫలితంగా భాగల్పూర్ జంక్షన్లో రద్దీ తగ్గుతుంది.ప్రస్తుతం, బారాహాట్-భాగల్పూర్ సెక్షన్లో సామర్థ్య ఉపయోగం 125 శాతానికి మించిపోయి, తీవ్ర రద్దీకి దారి తీస్తోంది. బారాహాట్-భాగల్పూర్, భాగల్పూర్-సాహిబ్‌గంజ్ సెక్షన్ల మధ్య తిరిగే రైళ్లు భాగల్పూర్లో ఇంజన్లను వెనక్కి మరలించుకోవాల్సివస్తోంది. ఇది ఆటంకానికీ, నిర్వహణ ప్రభావవంతంగా లేకపోవడానికీ కారణం అవుతోంది. ఇప్పుడు ఉపమార్గానికి ఆమోదం తెలిపినందువల్ల, సమయపాలనతోపాటు నిర్వహణ కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో మెరుగుపడుతుంది.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

- కాంగ్రెస్ నేతలు అబ్దుల్ రజాక్, షేక్ సాబీర్

రాజన్న సిరిసిల్ల, మార్చి 24: నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల, న్యూ అర్బన్ కాలనీ ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణకు తెలంగాణ సాహితి కళా సేవా సమితి ఉగాది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది.

ఈ సందర్భంలో ఆయనను పాఠశాలలో ఘనంగా సన్మానించా రు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహమ్మద్ అబ్దుల్ రజాక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ సాబీర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, అవార్డులు వాటి బాధ్యతలను మరింత పెంచుతాయని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థులలో క్రమశిక్షణ, జ్ఞానం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తారని, సమాజానికి అవసరమైన నైతిక విలువలను బోధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సయ్యద్ షబ్బీర్, అక్కన్న పెల్లి పరుశురాం పాల్గొన్నారు.

గాయపడ్డ వ్యక్తికి చెల్మెడ పరామర్శ

రాజన్న సిరిసిల్ల, మార్చి 24: నేటినిజం ప్రతినిధి): శాబాష్ పల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి వెంకటరాజం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చల్మెడ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. విషయం తెలుసుకున్న వేములవాడ నియోజకవర్గ బిఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు ఆయనను పరా మర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాధితుడికి మనో ధైర్యాన్ని కల్పించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి నిరుద్యోగులకు మోసం

- నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కరీంనగర్, మార్చి 24: (నేటినిజం ప్రతినిధి) రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన చేయలేక పోలీస్ రాజ్యం నడుపుతున్నదని నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. బీఆర్ఎస్ విద్యార్థి నాయకుడు పొన్నం అనిల్ కుమార్ గౌడ్‌ను మంగళవారం అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేసి కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించగా, ఉదయం 10 గంటల వరకు స్టేషన్‌లో ఉంచిన ఘటనపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయం తెలిసిన నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నాయకులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలు ప్రజల తరఫున అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు.

రాష్ట్రం లో ఎక్కడ సంఘటన జరిగినా బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు చేయడం దుర్మార్గమని అన్నారు.పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడు తూ, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకగా ఉన్న బీఆర్ఎస్‌ను అణిచివేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అర్ధరాత్రి ఇళ్లలోకి వచ్చి తలుపులు కొట్టి అరెస్టులు చేయడం అనాగరిక చర్య అని అన్నారు. ఇలాంటి చర్యలు కొనసాగితే ప్రజా వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు.ప్రభుత్వ కవ్వింపు చర్యలకు భయపడబోమని, ప్రతి అడుగులోనూ ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. అవసరమైతే జిల్లా స్థాయిలో పోరాటాలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చుక్క శ్రీనివాస్, బొంకూరి మోహన్, గడ్డి ప్రదీప్ యాదవ్, గంగాధర చందు, గణేష్, దినేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరులో జరిగే మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి సభను జయప్రదం చేయండి...

-బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపడిగా చంద్రశేఖర్

మహబూబాబాద్, మార్చి 24: (నేటినిజం ప్రతినిధి) మహబూబాబాద్ తొర్రూరు మండల కేంద్రంలో జరిగిన బీఎస్పీ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ సమీక్ష సమావేశానికి ఇదునూరి ప్రసాద్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఎస్పీ జనగాం జిల్లా అధ్యక్షుడు మడిపడిగా చంద్రశేఖర్ హాజరు అయి తొర్రూరు మండల మహిళా కన్వీనర్ గా ఘనపురం శ్వేత శ్రీ రామకృష్ణ ,తొర్రూరు మండల ప్రధాన కార్యదర్శిగా మంగళపెల్లి కృష్ణ లను నియమించడం జరిగినది. చంద్రశేఖర్ మాట్లాడుతూ బహుజన వర్గాల కోసం బీఎస్పీ పార్టీని మరింత ముందుకు తీసుకోవాలి అని మీ పదవిని బాధ్యతగా తీసుకొని తొర్రూరు మండల కేంద్రంలో బీఎస్పీ సత్తా చాటాలి అని ఏప్రిల్ 11 తేదీన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా తొర్రూరు లో నిర్వహించాలి అని చెప్పారు ఈ కార్యక్రమంలో జనగాం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ్,తొర్రూరు మండల అధ్యక్షులు సంపత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

మహిళలకు రిఫ్రిజరేటర్లు, సబ్సిడీపై బైకులు.. ఉచిత పథకాలతో ఏఐఏడీఎంకే మేనిఫెస్టో

తమిళనాడుమార్చి 24: తమిళనాడు అంటేనే ఉచిత పథకాలకు ప్రసిద్ధి. దేశంలో ఉచిత పథకాల్ని ఎక్కువగా అలవాటు చేసిన రాష్ట్రంగా తమిళనాడుకు గుర్తింపు ఉంది. అందుకే అనేక పార్టీలు తమిళనాట ప్రజలకు ఉచిత పథకాల్ని ప్రకటిస్తున్నాయి. త్వరలో అసెంబ్లీ ఎన్నికల కోసం ఏఐఏడీఎంకే పార్టీ కూడా తాజాగా ఉచిత పథకాలతో మేనిఫెస్టో రూపొందించింది.

దీని ప్రకారం రాష్ట్రంలో రేషన్ కార్డు కలిగిన మహిళలకు ఉచితంగా ఫ్రిజ్‌లు అందించనున్నారు. అలాగే, ఐదు లక్షల మంది వర్కింగ్ మహిళలకు టూ వీలర్స్‌పై సబ్సిడీ అందజేస్తారు. ఒక్కో బైకుకు రూ.25,000 వరకు సబ్సిడీ అందిస్తారు.

2026 ద్వితీయార్థంలో- వ్యాపారం పుంజుకుంటుందని ఆశిస్తున్న లానెక్సెస్

హైదరాబాద్, మార్చి 24: స్పెషాలిటీ కెమికల్స్ సంస్థ అయిన లానెక్సెస్‌కు సంబంధించి, 2025 ఆర్థిక సంవత్సరం బలహీనమైన మార్కెట్ వాతావరణం, అధిక స్థాయి భౌగోళిక రాజకీయ అనిశ్చితితో కూడి ఉంది. సంస్థ ఆదాయం 5.673 బిలియన్ యూరోలుగా నమోదైంది; ఇది గత ఏడాది నాటి 6.366 బిలియన్ యూరోల గణాంకాలతో పోలిస్తే 10.9 శాతం తక్కువ. అసాధారణ అంశాలకు ముందు లెక్కించిన ఈ బి ఐ టి డి ఏ 16.9 శాతం మేర క్షీణించి, గత ఏడాది నాటి 614 మిలియన్ యూరో ల స్థాయి నుండి 510 మిలియన్ యూరోలకు పడిపోయింది. పూర్తి సంవత్సరానికి గాను, అసాధారణ అంశాలకు ముందు లెక్కించిన ఈ బి ఐ టి డి ఏ మార్జిన్ 9.0 శాతంగా ఉంది; అంతకు ముందు ఏడాదిలో ఇది 9.6 శాతంగా నమోదైంది.

దాదాపు అన్ని కస్టమర్ పరిశ్రమలలో నిరంతరం బలహీనంగా ఉన్న డిమాండ్, దాని కి అనుగుణంగా తగ్గిన అమ్మకాల పరిమాణాలే ఈ పరిణామానికి ప్రధాన కారణం. ముడి పదార్థాల కొనుగోలు ధరలు తగ్గడం, కొన్ని వ్యాపారాలలో ఆసియా ప్రాంతం నుండి కొనసాగుతున్న ధరల ఒత్తిడి అమ్మకపు ధరల తగ్గింపునకు దారితీశాయి. అదనంగా, ఏప్రిల్ 1, 2025న యురేథేన్ సిస్టమ్స్ వ్యాపార విభాగాన్ని అమ్మిన తర్వాత దాని నుండి ఆదాయాలు లేకపోవడం, అలాగే ప్రతికూల కరెన్సీ ప్రభావాల కారణంగా నిర్వహణ ఫలితాలు తగ్గాయి."2025 సంవత్సరం మొత్తం రసాయన పరిశ్రమకు, అలాగే లానెక్సెస్‌కు కూడా అత్యంత కఠినమైనది. 2026లో, జర్మన్ ప్రభుత్వం మౌలిక సదుపాయాల ప్రోత్సాహక కార్య క్రమం వంటి వాటి ద్వారా, వీలైనంత త్వరగా ఈ సంవత్సరం ద్వితీయార్థంలో సాను కూల పురోగతిని చూస్తామని మేం ఆశిస్తున్నాం" అని లానెక్సెస్ సీఈఓ మథియాస్ జాచెర్ట్ అన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com